



'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | శనివారం | 17-10-2026 | సంపుటి: 3 | సంచిక: 253 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 17-10-2026 | V0LUME : 3 | ISSUE : 253 | PAGES: 8 | COST: 2/- |



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




# కేటీఆర్ లేఖకు రేవంత్ కౌంటర్ అటాక్!

- యాదాద్రి బొగ్గు ఒప్పందాలపై 2016 నాటి పత్రాలు బయటపెట్టిన సీఎం
- ఏ విచారణకైనా సిద్ధమంటూ కేటీఆర్‌కు సవాల్
- యాదాద్రి ప్లాంట్‌తో రూ.50 వేల కోట్ల అదనపు భారం అంటూ ప్రభుత్వ వాదన
- 25 ఏళ్లలో రూ.లక్ష కోట్ల నష్టం జరుగుతుందని సీఎం వ్యాఖ్య
- కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి పైప్‌లైన్‌పైనా రేవంత్ ప్రశ్నలు

**హైదరాబాద్, అక్టోబర్ 16:**
తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు రాజకీయ వేడిని పెంచుతున్నాయి. ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలతో బీఆర్ఎస్ దాడి చేస్తుండగా, వాటిని తిప్పికొట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదురుదాడికి దిగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు దిగుమతులు, సింగరేణి వ్యవహారాలతో పాటు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి సరఫరా అంశాలను తెరపైకి తెస్తూ ప్రతిపక్షాన్ని ప్రశ్నిస్తున్నారు.
యాదాద్రి బొగ్గు ఒప్పందాలపై వాదోపవాదాలు
యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకునే వ్యవహారంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ అంశంపై విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన సీఎం.. కేసీఆర్ హయాంలోనే 2016లో దిగుమతి బొగ్గుకు సంబంధించి ఒప్పందం జరిగిందని పేర్కొంటూ పత్రాలను బయటపెట్టారు యాదాద్రి ప్లాంట్‌కు అవసరమైన 14 మిలియన్ టన్నుల బొగ్గులో ఏడు మిలియన్ టన్నులను దిగుమతి చేసుకునేలా 2016 డిసెంబర్ 9న ఎంఎస్‌పీసీతో ఒప్పందం చేసుకున్నారని ప్రభుత్వం వెల్లడించింది. దిగుమతి బొగ్గు సరఫరా విషయమై అప్పట్లోనే రైల్వే శాఖకు లేఖ రాసినట్లు పేర్కొంది. ఈ వ్యవహారంలో ఏ విచారణకైనా సిద్ధమని, ఏ తరహా విచారణ కావాలో చెప్పాలని రేవంత్ రెడ్డి కేటీఆర్‌కు సవాల్ విసిరారు.
విద్యుత్ ఉత్పత్తి వ్యయంపై ప్రభుత్వ లెక్కలు
యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం, విద్యుత్ ఉత్పత్తి వ్యయంపైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నలు లేవనెత్తుతోంది. మణుగూరు ప్రాంతంలో ప్లాంట్ నిర్మించి ఉంటే ఉత్పత్తి వ్యయం తగ్గేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. మణుగూరులో యూనిట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.4.62, కొత్తగూడెంలో రూ.3.94, సింగరేణి 1, 2 ప్లాంట్లలో రూ.4.05 ఖర్చవుతుండగా..

మిగతా 2వ పేజీలో..

# హ్యుందాయ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి

- సంస్థ యాజమాన్యానికి సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రం-
- పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలి

**హైదరాబాద్, అక్టోబర్ 16:**
తెలంగాణను కార్ల తయారీకి అనువైన ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను

మిగతా 2వ పేజీలో..





## ఈఎంఐ సీఎం రేవంత్ రెడ్డి

- అధిష్ఠానానికి ఈఎంఐలు కట్టకపోతే పదవి నిలవదు
- విద్యుత్, సాగునీటి సంక్షోభాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం
- ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు
- సంక్షోభాన్ని సృష్టించి బొగ్గు కొంటామంటూ నాటకాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3

## 'సహకార' ఎన్నికల కోసం ఒత్తిడి తేవాలి

3

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

- కర్ణాటక పరిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం
- బెంగళూరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ' రోడ్‌షో
- 2047 నాటికి $3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమన్న మంత్రి

2





# మూడు నెలల్లోగా రోహిత్ వేముల బిల్లు ముసాయిదా

- విద్యార్థుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం
- ఎస్సీల అభివృద్ధి శాఖ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- న్యాయ, విద్యా, హోం శాఖలు, యూజీసీ భాగస్వామ్యంతో కసరత్తు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, అక్టోబర్ 16:**
ప్రతిపాదిత 'రోహిత్ వేముల తెలంగాణ బిల్లు'కు సంబంధించిన ప్రాథమిక ముసాయిదాను మూడు నెలల్లోగా సిద్ధం చేసి సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీ (సీఎస్‌సీ)కి సమర్పించాలని

మిగతా 2వ పేజీలో..



4

## బంగ్లాదేశ్ తరహా అస్థిరతకు కుట్ర?

- ఇండియా బ్లాక్, రాహుల్ గాంధీ, సీజేపీపై రాజ్‌నాథ్ సింగ్ ఆరోపణలు
- భారత్‌లో అశాంతి సృష్టించి అధికార మార్పిడికి ప్రయత్నిస్తున్నారని విమర్శ
- రాహుల్ ఓట్ల చోరీ ఆరోపణలు దివాళీ టపాసుల్లా తేలిపోయాయని ఎద్దేవా
- కాంగ్రెస్ పాలనలోని ఎమర్జెన్సీ, 1984 అల్లర్లను ప్రస్తావించిన రక్షణ మంత్రి

## సంజయ్ రౌత్‌కు సుప్రీంకోర్టు షాక్

- సీజేఐపై వ్యాఖ్యలతో శివసేన యూబీటీ ఎంపీకి షోకాజ్ నోటీసులు
- జర్నలిస్ట్ నిఖిల్ వాగ్లేకూ నోటీసులు జారీ




4

## మోదీకి వ్యతిరేకంగా విద్రోహ శక్తుల కుట్రలు



- కాంగ్రెస్‌ది బ్లాక్‌మెయిల్, దిగజారుడు రాజకీయం
- అజిత్ దోవల్ వంటి వారిని రాజకీయాల్లోకి లాగడం దుర్మార్గం
- 'సర్'పై ప్రాథమిక పరిజ్ఞానం లేని రాహుల్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

2

## కరువు నివారణలో సీఎం అట్టర్ ఫ్లాప్

- రేవంత్ అవగాహనా రాహిత్యంతోనే సమస్య
- రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

3

# యాదాద్రి'కి 'మహానది' బొగ్గు కేటాయించాలి



- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ
- రాష్ట్ర అభివృద్ధి పనులపై వినతిపత్రాలు అందజేత

**హైదరాబాద్, అక్టోబర్ 16 :**
యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు ముఖ్యమంత్రి కోరిన విధంగా మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి బొగ్గు కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో కేంద్ర మంత్రితో ఆయన మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో

మిగతా 2వ పేజీలో..

## జీవన సౌందర్యాన్ని చాటే పండుగ బతుకమ్మ

- మహిళా జర్నలిస్టులతో బతుకమ్మ ఆడిన మంత్రి సీతక్క




2

## పోలీస్ యూనిఫామ్ లో డ్యాన్స్ చేస్తే చర్యలు

- ప్రైవేట్ ఈవెంట్లలో ఖాకీ దుస్తుల్లో పాల్గొనడం క్రమశిక్షణా రాహిత్యమే
- పోలీసు శాఖ క్రమశిక్షణ, గౌరవాన్ని కాపాడాలి
- డీజీపీ ఆనంద్ హెచ్చరిక

2



# కేటీఆర్ లేఖకు రేవంత్ కౌంటర్ అటాక్!

**మొదటిపేజీ తరువాయి**

యాదాద్రిలో మాత్రం రూ.6.60 అవుతోందని ప్రభుత్వం పేర్కొంటోంది.

ఈ లెక్కల ప్రకారం యాదాద్రిలో ఒక్కో యూనిట్‌పై రూ.2.20 అదనపు వ్యయం అవుతోందని, ప్లాంట్ కారణంగా రూ.50 వేల కోట్ల భారం పడుతోందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాబోయే 25 ఏళ్లలో ఈ నష్టం రూ.లక్ష కోట్లకు చేరుతుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొంటూ, ఇందుకు బాధ్యత వహించాల్సిన వారెవరో చెప్పాలని ప్రశ్నించారు. అయితే, ఈ అంచనాలకు సంబంధించిన పూర్తి లెక్కలు, స్వతంత్ర ధ్రువీకరణ వివరాలు ఇక్కడ అందుబాటులో లేవు.

**కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి సరఫరాపైనా ప్రశ్నలు**

మరోవైపు కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లోని అసైన్డ్ భూముల వ్యవహారంపై జరుగుతున్న దర్యాప్తు నేపథ్యంలో, పంచపాండవుల చెరువులకు నీటిని తరలించిన అంశాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. కొండ పోచమ్మ సాగర్ నుంచి చెరువుల్లోకి నీటిని నింపి, అక్కడి నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించారంటూ ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ఏర్పాటుకు అనుమతులు ఎలా వచ్చాయని, ఫామ్‌హౌస్‌కు ప్రత్యేక పైప్‌లైన్ ఎందుకు వేశారని నిలదీశారు. ఈ అంశంపై నిజనిర్ధారణకు మీడియాను పంపాలా, కమిటీ వేయాలా చెప్పాలని సవాల్ విసిరారు.

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో రైతులు నీటి కొరతను ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తున్న నేపథ్యంలో, ఫామ్‌హౌస్‌కు నీటి సరఫరా అంశాన్ని సీఎం చర్చకు తీసుకురావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వంపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు పాత ఒప్పందాలు, విద్యుత్ ఉత్పత్తి వ్యయాలు, భూములు, నీటి సరఫరా అంశాలను ప్రస్తావిస్తూ సమాధానం చెప్పే వ్యూహాన్ని అధికార పక్షం అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది.

# జీవన సౌందర్యాన్ని చాటే పండుగ బతుకమ్మ

**హైదరాబాద్, అక్టోబర్ 16 :**

బతుకమ్మ అంటే పూల పండుగ మాత్రమే కాదు.. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రకృతిని పూజిస్తూ పూలను కొలుస్తూ జీవన సౌందర్యాన్ని చాటే పండుగ అని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వం.. ఆడబిడ్డల ఆనందం.. మహిళల ఐక్యత.. ఆత్మీయత కలగలిసిన పండుగ బతుకమ్మ అని చెప్పారు. తంగేడు, గునుగు పూలతో పేర్చే బతుకమ్మలో తెలంగాణ మట్టి పరిమళం ఉంటుందని, ప్రకృతిని ప్రేమించడం.. పర్యావరణాన్ని కాపాడుకోవడం బతుకమ్మ మనకు నేర్పించే గొప్ప సందేశం అని అన్నారు. కులమతాలకు అతీతంగా మహిళలంతా ఒక్కచోట చేరి సంబరాలు చేసుకోవడం బతుకమ్మ ప్రత్యేకత అన్నారు. బతుకమ్మ పాటల్లో తెలంగాణ పల్లె జీవితం.. మహిళల కష్టసుఖాలు.. మన నేల సంస్కృతి ప్రతిధ్వనిస్తాయని తెలిపారు. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయాన్ని మన పిల్లలకు అందించడం మనందరి బాధ్యత అన్నారు. మన పండుగలను కాపాడుకోవడం అంటే మన మూలాలను, మన అస్తిత్వాన్ని కాపాడుకోవడమేనని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బతుకమ్మ బతుకు సందేశం ఇస్తుంది.. ఐక్యతను చాటుతుంది.. తెలంగాణ గర్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తుంది అని చెప్పారు.

# పోలీస్ యూనిఫామ్ లో డ్యాన్స్ చేస్తే చర్యలు

**హైదరాబాద్, అక్టోబర్ 16:**

పోలీసు యూనిఫామ్లో ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొనడం, డ్యాన్సులు వేయడం వంటి చర్యలపై డీజీపీ సీవీ ఆనంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాకీ దుస్తుల్లో రీల్స్, డ్యాన్సులు చేయడం నిబంధనలకు విరుద్ధమని, ఇలాంటి చర్యలకు పాల్పడే సిబ్బందిపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు తప్పవని అధికారులకు స్పష్టమైన వార్నింగ్ ఇచ్చారు. కొంతకాలంగా రకరకాల ప్రైవేట్ ఈవెంట్లలో, సాంస్కృతిక కార్యక్రమాల్లో విధి నిర్వహణలో లేదా యూనిఫామ్ లో ఉన్న పోలీసులు డ్యాన్స్ వేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వీడియోలపై నెటిజన్ల నుంచి, ప్రజా సంఘాల నుంచి తీవ్ర చర్చ జరగడమే కాక క్రమశి క్షణకు మారుపేరైన పోలీసు శాఖ ప్రతిష్ట దిగజారుతోందన్న విమర్శలు తారస్థాయికి చేరాయి. ఈ పరిణామాలను తీవ్రంగా పరిగణించిన డీజీపీ ఆనంద్ ఈ ఆదేశాలను జారీ చేశారు. పోలీసు యూనిఫామ్ అనేది దుస్తులు మాత్రమే కాదని, అది బాధ్యత, అధికారం, అత్యున్నత క్రమశిక్షణకు ప్రతీక అని డీజీపీ స్పష్టం చేశారు. ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది ఆ దుస్తుల గౌరవాన్ని, సమాజంలో పోలీస్ వ్యవ స్థకున్న మర్యాదను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇకపై యూనిఫామ్ లో డ్యాన్సు లు చేసినా, విధి నిర్వహణకు సంబంధం లేని ప్రైవేట్ కార్యక్రమాల్లో యూనిఫామ్ లో పాల్గొన్నా శాఖాపరమైన విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

**బెంగళూరు, అక్టోబర్ 16 :**



తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు ఒకే విలువ ఆధారిత గొలుసులో భాగమని, రెండు రాష్ట్రాల భాగస్వామ్యం దక్షిణ భారత ఆర్థికాభివృద్ధికి మరింత తోడ్పడుతుందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలను వివరించేందుకు బెంగళూరులో శుక్రవారం నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' రోడ్‌షో విజయవంతంగా ముగిసింది. కర్ణాటకకు చెందిన పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆయన ఆహ్వానించారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట' డిసెంబర్ 7 నుండి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో ఘనంగా జరగనుందని వివరించారు. 2034 నాటికి తెలంగాణను లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, 2047 నాటికి 3 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి వివరించారు. ఏరోస్పేస్, లైఫ్ సైన్సెస్, సెమీకండక్టర్లు, టెక్స్‌టైల్స్ రంగాల్లో పెట్టుబడులు, ఉమ్మడి భాగస్వామ్యాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అత్యాధునిక మౌలిక వసతులు, పారిశ్రామిక అనుకూల విధానాలతో తెలంగాణ పారిశ్రామిక రంగానికి గమ్యస్థానంగా మారిందని చెప్పారు.

# మోదీకి వ్యతిరేకంగా విద్రోహ శక్తుల కుట్రలు

**హైదరాబాద్, అక్టోబర్ 16 :**

శ్రీలంకలో ప్రభుత్వాన్ని కూల్చిన మాదిరిగానే భారత్‌లోనూ ఎన్డీయే ప్రభుత్వాన్ని కూల్చేస్తామని రాహుల్ గాంధీ దింపుడు కళ్లం ఆశలు పెట్టుకుంటున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ.. నీకు దమ్ముంటే ప్రజాదరణతో ఎన్నికైన మోదీ ప్రభుత్వాన్ని పడగొట్టి చూడు అంటూ తీవ్రంగా హెచ్చరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల నిర్వహణ యావత్ ప్రపంచానికే ఆదర్శమని స్పష్టం చేశారు. అమెరికా వంటి అగ్రరాజ్యాల్లో ఎన్నికల ప్రక్రియ, కౌంటింగ్ నెలలతరబడి సాగుతుందని, కానీ మన దేశంలో 140 కోట్ల మంది ప్రజల అభీష్టాన్ని నిష్పక్షపాతంగా ఒక్క రోజులోనే తీర్పు వెల్లడించే అద్భుతమైన స్వతంత్ర వ్యవస్థ ఎన్నికల కమిషన్‌దని గుర్తు చేశారు. అలాంటి ఎన్నికల కమిషన్‌పై బురద చల్లేందుకు రాహుల్ నిరంతరం యత్నిస్తున్నారని మండిపడ్డారు. దేశ భద్రతను కాపాడుతూ దేశ ప్రజల, యువత హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను రాజకీయాల్లోకి లాగడం అత్యంత దుర్మార్గమని కిషన్ రెడ్డి ఖండించారు. రాహుల్ వ్యవహారశైలి అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందని ఆయన విమర్శించారు. ఉన్నధికారులు తనకు టచ్‌లో ఉండి సమాచారం లీక్ చేస్తున్నారని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదమన్నారు. సాధారణంగా ప్రతిపక్ష నాయకుడు అధికారులతో సత్సంబంధాలు పెంచుకోవడం గౌరవప్రదమని, కానీ ప్రభుత్వ అధికారులతో మాట్లాడే సంస్కృతి, సోయి రాహుల్‌కు లేవని దుయ్యబట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి ఇంత బాధ్యతారాహిత్యమైన, బలహీనమైన ప్రతిపక్ష నేతను దేశం ఎన్నడూ చూడలేదని విమర్శించారు. నాడు వాజ్‌పేయి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు కాంగ్రెస్‌తో విభేదాలు ఉన్నప్పటికీ దేశ ప్రయోజనాల కోసం పీవీ నరసింహారావు ప్రభుత్వ హయాంలో ఐక్యరాజ్య సమితిలో భారత ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన సంప్రదాయాన్ని గుర్తు చేశారు. చరిత్ర చదివి ఇలాంటి విలువలు నేర్చుకోవాలని రాహుల్‌కు హితవు పలికారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బెదిరిస్తూ రాహుల్ దాదాగిరి భాష మాట్లాడుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. 'ప్రజలు మీకు వోట్లు వేయకపోతే ఎన్నికల కమిషనర్ బాధ్యుడా? తమిళనాడులోనో, కేరళంలోనో.. ఇలా ఎక్కడైనా బీజేపీ ఓడిపోతే తాము ఇలాగే దాదాగిరి భాష మాట్లాడాలా అని ప్రశ్నించారు. వోట్ల చోరీ ఎక్కడా జరగలేదని, చోరోం కూ జనతా వోట్ నహీ దేరహీ (దొంగలకు ప్రజలు ఓటు వేయడం లేదు) అన్న వాస్తవాన్ని రాహుల్ గ్రహించాలని చురకలంటించారు.

**న్యాయస్థానాలకు ఊరేగింపులు గర్హనీయం**

న్యాయస్థానాల ముందుకు కాంగ్రెస్ నేతలు ఊరేగింపుగా వెళ్లడం అత్యంత గర్హనీయమని అన్నారు. స్వాతంత్ర్య పోరాటం జరిగినప్పుడు కూడా ఎవరూ కోర్టుల ముందు ఊరేగింపులు చేయలేదని, కానీ రాహుల్ గాంధీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, పదవులు పోయిన నాయకులను విమానాలు, రైళ్లలో తరలించి సుప్రీంకోర్టుపై ఒత్తిడి తెచ్చేందుకు, న్యాయమూర్తులను బ్లాక్‌మెయిల్ చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ శైలిని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. బారికేడ్లు ఎక్కి డ్యాన్సులు చేయడం, మహిళా పోలీసులపై దురుసుగా ప్రవర్తించడం, మహిళా కానిస్టేబుల్‌పై ప్రియాంక గాంధీ పిడిగుద్దులు కురిపించడం చూసి దేశ ఆడబిడ్డలు ఛీత్కరించుకుంటున్నారని అన్నారు.

**రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచకాలు**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగడుతూ ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేయాలన్నా, ఫీజు రీయింబర్స్‌మెంట్, జీవో 22ఏ సమస్యలపై పోరాడాలన్నా బీజేపీ కార్యకర్తలను, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని వారంలో ఐదుసార్లు అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి అక్రమంగా నిర్బంధిస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో రైతులు ఏడాదిన్నరపాటు నిరసనలు చేపడితే నీరు, ఆహారం, మరుగుదొడ్లు కల్పించి కేంద్రం ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించిందని గుర్తుచేశారు. ఇక్కడ ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ, బీజేపీ నాయకులు బయటకు రాకుండా గృహ నిర్బంధాలు చేస్తూ ఢిల్లీలో రాజ్యాంగ పరిరక్షణ అంటూ రేవంత్ రెడ్డి ఇచ్చే పెద్ద పెద్ద ఉపన్యాసాలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఆగ్రహించారు. దేశ అభివృద్ధిని, ప్రపంచవ్యాప్తంగా నరేంద్ర మోదీ నాయకత్వంలో పెరుగుతున్న దేశ ప్రతిష్ఠను జీర్ణించుకోలేక అంతర్జాతీయ పెట్టుబడిదారీ శక్తులు, డీప్ స్టేట్ మీడియా, విదేశీ శక్తులు, దేశీయ విద్రోహ శక్తులు ఏకమై కుట్రకు తెరలేపాయని కిషన్ రెడ్డి అన్నారు. యూపీ అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఢిల్లీలో ఒక్క రోజే పది వేల జీన్స్ ప్యాంట్లు, టీషర్టులు విద్యార్థులకు పంపిణీ చేసి అరాచకాలు సృష్టించేందుకు కుట్రలు పన్నారని ఆధారాలతో వివరించారు. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్, ఐఎల్‌వో వంటి అంతర్జాతీయ సంస్థలన్నీ దేశ జీడీపీ వృద్ధి, ఆర్థిక స్థిరత్వాన్ని వేనోళ్ల కొనియాడుతుంటే కొందరికి కంటగింపుగా మారిందన్నారు. ప్రపంచ శక్తులన్నీ ఏకమైనా నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని వెంట్రుక కూడా పీకలేవని స్పష్టం చేశారు.

**'సర్'పై ప్రాథమిక పరిజ్ఞానం లేని రాహుల్**

'సర్' ప్రక్రియపై రాహుల్ గాంధీకి ప్రాథమిక జ్ఞానం కూడా లేదని కిషన్ రెడ్డి అన్నారు. ఇది ఇప్పుడు మోదీ హయాంలో కొత్తగా వచ్చింది కాదు.. నెహ్రూ, ఇందిర, రాజీవ్, పీవీ నరసింహారావు కాలం నుంచే అమల్లో ఉన్న రాజ్యాంగ ప్రక్రియ అని గుర్తు చేశారు. 2014, 2019, 2024 సాధారణ ఎన్నికల్లో 'సర'తో సంబంధం లేకుండా ప్రజాదరణతోనే మోదీ ప్రభుత్వం పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చిందని స్పష్టం చేశారు. 'సర' ప్రవేశపెట్టకముందే కాంగ్రెస్ లెక్కలేనన్ని రాష్ట్రాల్లో ఘోరంగా ఓడిపోయిందని గుర్తుచేశారు. కేరళంలో సీపీఎం లక్షలాది దొంగ వోట్లను 'సర్ ద్వారా తొలగించడం వల్లే కాంగ్రెస్ గెలిచిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేష్ చెన్నితాల ఒప్పుకున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. పొంతన లేకుండా మాట్లాడుతూ వ్యవస్థలను దెబ్బతీసేందుకు యత్నిస్తున్న రాహుల్ గాంధీని, కాంగ్రెస్ పార్టీని కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కేరళం సహా యావత్ దేశ ప్రజలు పూర్తిగా తిరస్కరించడం ఖాయమని ఆయన తేల్చిచెప్పారు.

# మూడు నెలల్లోగా రోహిత్ వేముల బిల్లు ముసాయిదా

**మొదటిపేజీ తరువాయి**




డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అధికార్లను ఆదేశించారు. కమిటీ ఏర్పాటు నుంచి వివిధ భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపుల వరకు ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని, ఎలాంటి జాప్యానికి తావివ్వరాదని సూచించారు.తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన రోహిత్ వేముల తెలంగాణ బిల్లుపై సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీ రెండో సమావేశం జరిగింది. ప్రతిపాదిత బిల్లు రూపకల్పనకు అనుసరించాల్సిన విధానం, కమిటీ కూర్పు, న్యాయపరమైన అంశాలు, వివిధ వర్గాలతో సంప్రదింపుల ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. విద్యార్థుల హక్కులకు సమర్థవంతమైన రక్షణ కల్పించేలా చట్టాన్ని రూపొందించేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రోహిత్ వేముల చట్ట రూపకల్పన ప్రక్రియకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ (ఎస్‌సీడీడీ) నాయకత్వం వహించాలని సూచించారు. అవసరమైన సంబంధిత శాఖలు, సంస్థలకు కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని, న్యాయ శాఖను భాగస్వామిగా చేర్చాలని స్పష్టం చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, యూజీసీ తదితర సంస్థల భాగస్వామ్యంపై పరిశీలన జరపాలని సూచించారు. కమిటీని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి ముసాయిదా తయారీకి అవసరమైన కార్యాచరణను ప్రారంభించాలని ఆదేశించారు. రోహిత్ వేముల బిల్లు విషయంలో సమాజంలోని వివిధ వర్గాల నుంచి సమగ్ర సంప్రదింపుల ప్రక్రియ చేపట్టాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయ నిపుణులు, పౌర సమాజ సంస్థలు, విద్యారంగ నిపుణులు, ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరిపేందుకు ముందుగా జాబితా రూపొందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు సంబంధించిన అంశాలు, చట్ట అమలులో ఎదురయ్యే సవాళ్లను పరిగణనలోకి తీసుకొని ముసాయిదా సిద్ధం చేయాలని చెప్పారు. ప్రభుత్వ అధికారులతోపాటు నిపుణుల సంస్థల ప్రతినిధుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ అంశాలపై చర్చించిన అనంతరం న్యాయశాఖను కమిటీలో సభ్య శాఖగా చేర్చాలని, అయితే కమిటీకి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నాయకత్వం వహించాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అవసరాన్ని బట్టి ఇతర శాఖలు, నిపుణులు, సంబంధిత సంస్థలతో సంప్రదింపులు జరపాలని సూచించారు.

రోహిత్ వేముల బిల్లుకు అవసరమైన న్యాయపరమైన, సాంకేతిక అంశాల్లో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సహకారం తీసుకోవడంపై సమావేశంలో చర్చించారు. నిబంధనల రూపకల్పనలో సహకరించేందుకు నల్సార్ విశ్వవిద్యాలయం అంగీకరించినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి ఉప ముఖ్యమంత్రికి వివరించారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం, వివక్షను నిరోధించడం, విద్యాసంస్థల్లో న్యాయబద్ధమైన వాతావరణాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రతిపాదిత చట్టంలో ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశం అభిప్రాయపడింది. చట్టంలోని నిబంధనలు ఆచరణ సాధ్యంగా ఉండటంతోపాటు, వాటి అమలుకు అవసరమైన వ్యవస్థలపై కూడా స్పష్టత ఉండాలని పేర్కొన్నారు. మూడు నెలల్లోగా ప్రాథమిక ముసాయిదాను సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీకి సమర్పించి, తదుపరి పరిశీలనకు వీలుగా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్ణీత గడువులో కసరత్తు పూర్తయ్యేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు ఉపయోగపడే సమగ్ర చట్టం రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయం నైపుణ్యాన్ని వినియోగించుకుంటూ సంబంధిత శాఖలు, నిపుణుల సూచనలతో సమగ్ర ముసాయిదాను రూపొందించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్పెషల్ చీఫ్ సెక్రెటరి సబ్యసాచి ఘోష్, సీనియర్ ఐపీఎస్ అధికారి దేవేంద్ర సింగ్ చౌహాన్, ఐఏఎస్ అధికారులు యోగితా రాణా, విజయేంద్ర బోయి, న్యాయవాది దిశా వడేకర్ తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి'కి 'మహానది' బొగ్గు కేటాయించాలి

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, పెండింగ్ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. సత్తుపల్లి బ్లాక్3 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరారు. అలాగే తెలంగాణ రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.100 కోట్లు మంజూరు చేయాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని, సత్తుపల్లికొవ్వూరు, పెనుబల్లికొండపల్లి రైల్వే లైన్లకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పాండురంగాపురంమల్కన్‌గిరి రైల్వే లైన్‌ను సారపాక వరకు త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని ఆయన కోరారు.

# హ్యుందాయ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి

**మొదటిపేజీ తరువాయి**

ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ (హెచ్ఎంఐఈ) మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శుక్రవారం సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ జోన్ (నిమ్స్)లో రూ.8,528 కోట్ల పెట్టుబడితో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. 678 ఎకరాల్లో విడతలవారీగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే కొద్ది నెలల్లోనే ఆర్ అండ్ డీ కేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు ప్రభుత్వం సహకరించాలని వారు సీఎంను కోరారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి అవసరమైన అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ భౌగోళికంగా దేశం మధ్యలో ఉందని, హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కలిగిన నగరమని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోని ఆరు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలతో పోలిస్తే హైదరాబాద్ సురక్షితమైన, జీవించడానికి అనుకూలమైన కాస్మోపాలిటన్ నగరంగా గుర్తింపు పొందిందన్నారు. కార్ల తయారీ పరిశ్రమకు అవసరమైన రవాణా, మౌలిక సదుపాయాలు తెలంగాణలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. రహదారులు, రైలు మార్గాలు, విమానాశ్రయాలతోపాటు భవిష్యత్తులో ఓడరేవులకు హైస్పీడ్ కనెక్టివిటీ కల్పించే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్ల అభివృద్ధితో వాహన తయారీ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. పెరిఅర్బన్ రీజియన్ (ప్యూర్) వంటి ప్రణాళికల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, తయారీ రంగంలో పెట్టుబడులకు అనువైన వేదికగా నిలుస్తుందని సీఎం వివరించారు. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 2024 ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ ప్రతినిధులతో చర్చలు జరిపింది. 2025 జూన్‌లో హ్యుందాయ్ ఆరఅండ్‌డీ కేంద్రం ప్రతిపాదనకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ప్రపంచస్థాయి సౌకర్యాలతో భారీ శాటిలైట్ నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సీఎం హ్యుందాయ్ ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలియజేస్తూ రాబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు హాజరుకావాలని సంస్థ యాజమాన్యాన్ని ఆహ్వానించారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ సాంకేతిక, అధునాతన ఇంజినీరింగ్ కేంద్రంగా మరింత బలోపేతం చేయాలన్న హ్యుందాయ్ లక్ష్యం తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు అనుగుణంగా ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో తమ సంస్థ భాగస్వామిగా కొనసాగుతుందన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్‌ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**హైదరాబాద్‌తో రెండు దశాబ్దాల అనుబంధం**

హ్యుందాయ్ సంస్థకు హైదరాబాద్‌తో రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. హైటెక్ సిటీలోని కేంద్రం అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు మద్దతునిస్తూ కీలక ఆరఅండ్‌డీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సామర్థ్యాలను మరింత విస్తరించేలా జహీరాబాద్‌లో గ్లోబల్ ఆరఅండ్‌డీ, మెగా టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రం ద్వారా వాహనాల రూపకల్పన, పరీక్షలు, పనితీరు, ధ్రువీకరణ, నాణ్యతా ప్రమాణాల పరిశీలనతోపాటు ఇంజినీరింగ్ ప్రక్రియలను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం కలగనుంది. హ్యుందాయ్ అధునాతన సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది.

# కరువు నివారణలో సీఎం అట్టర్ ఫ్లాప్

- రేవంత్ అవగాహనా రాహిత్యంతోనే సమస్య
- రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలి
- పవర్ మ్యాక్స్ కంపెనీతో ఒప్పందం ఏంటో బయటపెట్టాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, అక్టోబర్ 16:**

కరువు వస్తుందనే ముందే హెచ్చరించినా ముందస్తు చర్యలు చేపట్టడంలో సీఎం రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్ అయ్యారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది జనవరి నుంచే ఎల్ నినో ఎఫెక్ట్ తో తీవ్ర మైన కరువు వచ్చే ప్రమాదముందని హెచ్చరించినా కనీస చర్యలు చేపట్టలేదన్నారు. దొంగలు పడిన ఆరు నెలలకు అన్నట్లుగా ఇప్పుడొచ్చి రైతులు త్యాగాలు చేయాలని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కరువు విషయంలో తాను ఏమీ చేయలేనని రేవంత్ రెడ్డి నిస్సహాయతను వ్యక్తం చేస్తూ చేతులెత్తేశారని మండిపడ్డారు. ఆగస్టులో 28 అలర్ట్ అయి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్నారు. పక్క రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించి కేంద్రానికే ఇప్పటికే నివేదిక పంపాయని గుర్తు చేశారు. మన సీఎం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇప్పుడు రివ్యూలు అంటూ కాలం వెళ్లదీసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతోందని, ఇప్పటివరకు పాలమూరు రంగారెడ్డి పూర్తి చేయలేదని, మేడిగడ్డ బ్యారేజ్ ను కూడా రిపేర్ చేయలేదని అన్నారు. వాటిని పూర్తి చేసి ఉంటే ఇవ్వాళ రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.86 లక్షల కోట్లు ఖర్చు చేసినా ప్రాజెక్టులు పూర్తి కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ.26 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా కొత్తగా నీళ్లు ఇవ్వలేదన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ రిపేర్లు చేసుకోవడానికి ఇదే సరైన సమయమని, వచ్చే వర్షాకాలంలోగా ఆ పనులు పూర్తి చేసి గోదావరి నీళ్లను వినియోగంలోకి తేవాలని ఆమె డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అనుభవలేమి రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. పంట నష్టపోయిన వారికి ఎకరానికి రూ.10 వేలు ఇస్తామని లీకులు ఇస్తున్నారే తప్ప ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయడం లేదన్నారు. యాసంగిలో పంటలు సాగు చేయకపోతే రైతు కూలీలు ఆగమయ్యే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు సైతం పనులు లేక పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి ఉందని, పట్టణాల్లో సరైన ఉపాధి అవకాశాలు లేవని అన్నారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వడంతో పాటు వారి కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో పని దినాలు పెంచడం కోసం ఇప్పుడు కమిటీ వేస్తే ఎప్పుడు కేంద్రానికి నివేదిక ఇస్తారు.. వాళ్లు ఎప్పుడు ఆమోదిస్తారని ప్రశ్నించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ లో కొన్ని కాంపోనెంట్లను ప్రైవేటీకరించి దోచుకునేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. పవర్ మ్యాక్స్ కంపెనీతో ముఖ్యమంత్రికి ఉన్న సంబంధాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కరెంట్ విషయంలో ప్రభుత్వానికి అధికారం ఉండాలని గతంలో మాట్లాడిన సీఎం.. ఇప్పుడు ప్రైవేటీకరణకు ఎందుకు యత్నిస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు నీళ్లు, కరెంట్ ఇవ్వగలిగే పరిస్థితి ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. కరెంట్ కష్టాలను అధిగమించేందుకు అవసరమైతే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కలుస్తామని, దిల్లీకి వెళ్లి కేంద్రం పెద్దలతో మాట్లాడతామని చెప్పారు. హైదరాబాద్ లో నీటి కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 8 వేల చెరువులు మాయం చేశారని చెప్పారు. దీంతో నగరంలో భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. కరువు విషయంలో అఖిలపక్ష మీటింగ్ పెడతామని అంటున్నారని కానీ దానితో ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. ఈ పని ముందే చేయాల్సిందన్నారు. బీసీ బిల్లు విషయంలో అఖిలపక్షాన్ని దిల్లీకి ఎందుకు తీసుకెళ్లలేదని నిలదీశారు. ఇప్పుడు తాను చేసిన తప్పుకు అందరినీ భాగస్వాములు చేసే ప్రయత్నం చేస్తున్నారని కవిత మండిపడ్డారు. విదేశీ బొగ్గు కొనుగోలు ఒప్పందాలపై విచారణ పేరుతో ప్రతిమ శ్రీనివాస్ రావుకు వ్యతిరేకంగా కేటీఆర్ లేఖ రాయడంపై కవిత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉద్యమకాలంలో బీఆర్ఎస్ కు పూర్తి అండగా ఉన్న ఆయనపై విచారణ కోరడం అంటే నమ్మినోళ్లను నట్టేట ముంచడమేనన్నారు. సాయం చేసిన వాళ్లను, కుల బంధువులను ఇబ్బంది పెట్టడం, ఇంటి మనిషినైనా తనను కిరాయి మనుషులతో తిట్టించే నైజం కేటీఆర్ ది అని మండిపడ్డారు. తమ పోరాటాలతోనే ప్రభుత్వం దిగి వచ్చి సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహిస్తోందని గుర్తు చేశారు.

# ‘సహకార’ ఎన్నికల కోసం ఒత్తిడి తేవాలి

- కేటీఆర్‌కు సహకార సంఘాల అధ్యక్షుల విజ్ఞప్తి
- సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ



**హైదరాబాద్, అక్టోబర్ 16 :**

రాష్ట్రంలోని సహకార సంఘాలు, సహకార బ్యాంకులకు వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)ల అధ్యక్షులు బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన సహకార సంఘాల అధ్యక్షులు తెలంగాణ భవన్‌లో ఆయనను కలిసి సహకార రంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన కేటీఆర్ ఎన్నికల నిర్వహణ కోసం తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో సహకార బ్యాంకుల మొత్తం వ్యాపారం సుమారు రూ.13 వేల కోట్లుగా ఉండగా కేసీఆర్ నేతృత్వంలోని పదేళ్ల బీఆరఎస్ పాలనలో అది రూ.60 వేల కోట్లకు చేరిందని అధ్యక్షులు తెలిపారు. రైతాంగానికి మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో సొసైటీలకు స్వయం ప్రతిపత్తి కల్పించి, ఎన్నికల ద్వారా పాలకవర్గాలను ఏర్పాటు చేయడంతో రైతులకు చేరువగా సేవలు అందించగలిగాయని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలకవర్గాలతో నడిపిస్తుండటంతో సహకార రంగం తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**పంట రుణాలు ఇవ్వలేని స్థితిలో సహకార బ్యాంకులు**

మేనేజ్‌మెంట్ కమిటీలు లేకపోవడంతో సహకార బ్యాంకులు రైతులకు పంట రుణాలు అందించలేని పరిస్థితి ఏర్పడిందని అధ్యక్షులు తెలిపారు. ప్రస్తుత పంట సీజన్‌లో సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. బ్యాంకుల సీఈవోలకు పరిమిత అధికారాలే ఉండటంతో రూ.10 లక్షలకు మించిన రుణాల మంజూరుకు అవసరమైన నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతోందన్నారు. దీంతో జిల్లా సహకార బ్యాంకుల కార్యకలాపాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాల పంపిణీ కూడా ప్రభావితమవుతున్నాయని వివరించారు. ఉన్నత విద్య కోసం ఐఐటీలు, ఐఐఎంలలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సైతం రుణాలు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పాలకవర్గాల పునరుద్ధరణ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉందని, న్యాయపరమైన ప్రక్రియలో జాప్యం జరుగుతున్నందున తక్షణమే ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. సహకార సంఘాలు, బ్యాంకులు తిరిగి బలోపేతం కావాలన్నా, రైతులకు పంట రుణాలు, విద్యార్థులకు విద్యా రుణాలు సహా అవసరమైన సేవలు సక్రమంగా అందాలన్నా పాలకవర్గాలకు ఎన్నికలు జరిపించాలని కోరారు.

# ఈఎంఐ సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 16:**

సింగరేణిలో కుంభకోణాలు జరుగుతున్నాయని తాము చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శనివారం జరిగిన నర్సంపేట నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కుంభకోణాలు, ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్ల వ్యవహారంపై దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి హయాంలో జరిగినట్లు తాము ఆరోపిస్తున్న అక్రమాలపైనా న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. తాను ఉత్తరం రాస్తే విచారణకు ఆదేశిస్తానని ముఖ్యమంత్రి చెప్పడం కాదని, మీడియా ముందు ప్రకటనలు చేయడం కాక వాస్తవంగా విచారణ జరిపించాలని స్పష్టం చేశారు. సింగరేణిలో తన బామ్మర్ది ప్రమేయంతో జరిగిందని తాము ఆరోపిస్తున్న రూ.10 వేల కోట్ల కుంభకోణంపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో సోలార్ పవర్ కుంభకోణాన్ని కూడా బయటపెడతామన్నారు. గతంలో 70 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సింగరేణిని బలహీనపరిచి, ఇప్పుడు ఆ సంస్థను పక్కనపెట్టి విదేశీ బొగ్గు కొనుగోళ్లకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఒకప్పుడు 24 గంటల విద్యుత్ సరఫరాకు అండగా నిలిచిన సింగరేణినే ఇప్పుడు రేవంత్ రెడ్డి బదనాం చేస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో టన్ను బొగ్గు సుమారు రూ.3,800కు లభిస్తుంటే విదేశాల నుంచి కొనుగోలు చేస్తే టన్నుకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా నుంచి బొగ్గు కొనుగోళ్ల పేరుతో కమీషన్లు పొందేందుకే ఈ వ్యవహారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి ‘ఈఎంఐ’లు కట్టకపోతే ముఖ్యమంత్రి పదవి పోతుందనే భయంతోనే విదేశీ బొగ్గు కొనుగోళ్ల వ్యవహారంలో కమీషన్లు సమకూర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు చెల్లించాల్సిన ఈఎంఐలను వసూలు చేసేందుకే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాష్ట్రంలో ఉన్నారని, రికవరీ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిని తగ్గించడం వల్లే నేడు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వద్ద బొగ్గు కొరత ఏర్పడిందన్నారు. సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలను పెండింగ్‌లో పెట్టి బొగ్గు సరఫరా చేయడం లేదంటూ సంస్థను బదనాం చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను దెబ్బతీసిన తర్వాత ఇప్పుడు విద్యుత్ కొనుగోలు చేయాలంటే కరెంట్ అందుబాటులో లేదంటూ అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. గతంలో ఛత్తీస్‌గఢ్ లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకున్నప్పుడు కూడా కుంభకోణంగా చిత్రీకరించారని గుర్తుచేశారు. అప్పట్లో యూనిట్ విద్యుత్‌ను రూ.3.90కు కొనుగోలు చేస్తే కుంభకోణమని ఆరోపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు యూనిట్‌కు రూ.15 చెల్లించి విద్యుత్ కొనుగోలు చేయాలని చూస్తోందని విమర్శించారు. గత విద్యుత్ కొనుగోళ్లపై కుంభకోణం పేరుతో కమిషన్ ఏర్పాటు చేసి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల విద్యుత్ పంపు సెట్లు ఉన్నాయని, రైతులకు నిరంతర విద్యుత్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. కుటీర పరిశ్రమలు, ఇతర పరిశ్రమలకు కూడా నిరంతర విద్యుత్ సరఫరా అవసరమని తెలిపారు. ఈ అవసరాలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసి 24 గంటల విద్యుత్ అందించిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే విద్యుత్ కోతలు మొదలయ్యాయని విమర్శించారు.

సాగునీరు, కరువు పరిస్థితులపై కాంగ్రెస్ ప్రభుత్వం సరైన సమయంలో స్పందించలేదని కేటీఆర్ ఆరోపించారు. సుమారు వెయ్యి టీఎంసీల నీటిని సముద్రంలోకి వదిలేసి ఇప్పుడు ఎల్‌నినోను సాకుగా చూపుతూ చేతులెత్తేస్తున్నారని విమర్శించారు. ఆరు నెలల ముందే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసి వినియోగించుకోవాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు వెళ్లి వృథాగా దిగువకు ప్రవహిస్తున్న నీటిని ప్రజలకు, ప్రభుత్వానికి చూపించామని చెప్పారు. అయినప్పటికీ ప్రభుత్వం నీటిని ఎత్తిపోసేందుకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కొన్నేళ్లుగా తనపై, బీఆర్ఎస్‌పై చేసిన ఆరోపణలు తప్పని తేలిపోతాయనే ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి నీటిని ఎత్తిపోసేందుకు ముందుకు రాలేదని విమర్శించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి వినియోగించుకోవాలని కోరినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. అందుబాటులో ఉన్న నీరు వృథాగా దిగువకు వెళ్లిపోయిందని, పంటలు ఎండిపోతున్నాయని, తాగునీరు, సాగునీటి కొరత మొదలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు చర్యలు తీసుకోకుండా ఇప్పుడు ఎల్‌నినో వచ్చిందని చెప్పి ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఏపీలో సుమారు 700 కి.మీ దూరంలోని కుప్పం వరకు నీటిని తీసుకెళ్లారని, పట్టిసీమ పంపుల ద్వారా సుమారు 400 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తున్నారని తెలిపారు. పోతిరెడ్డిపాడు మొదలుకొని వివిధ ప్రాజెక్టుల్లో నీటిని నింపుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో కేవలం 70 కి.మీ దూరంలో ఉన్న మహబూబ్‌నగర్‌కు కూడా నీటిని తీసుకెళ్లలేకపోతున్నారని రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా రాష్ట్రం దేశానికి అన్నపూర్ణగా నిలిచే పరిస్థితి ఉండేదని, కానీ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం కరువు దిశగా వెళ్తోందని అన్నారు. తెలంగాణలో క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి రావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. నర్సంపేట నియోజకవర్గంలో రాబోయే రెండేళ్లలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. సుదర్శన్ రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా కలిసి పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్ష మేరకు కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రస్తుత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులన్నీ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పని చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. సింగరేణి పరిరక్షణ, విద్యుత్ సంక్షోభం, సాగునీటి సమస్యలు, రైతుల ఇబ్బందులు వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటాన్ని కొనసాగిస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఆ వ్యాఖ్యలపై మీ వైఖరి ఏమిటి?

- కాంగ్రెస్‌ను ప్రశ్నించిన బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు



**హైదరాబాద్, అక్టోబర్ 16 :**

బంగ్లాదేశ్ తరహాలో దేశంలో అరాచకం, హింస సృష్టించి ప్రభుత్వ మార్పుకు కుట్ర పన్నుతున్న శక్తుల పట్ల కాంగ్రెస్ వైURి ఏమిటో చెప్పాలని బీజేపీ¾ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు నిలదీశారు. శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో కాశ్మీర్ సహా పలు జాతీయ అంశాలపై నిరంతరం దేశ వ్యతిరేక వైఖరిని ప్రదర్శించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ విద్యార్థి విభాగమైన ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఐసా) అధ్యక్షురాలు నేహా బోరా, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నేత అభిజీత్ దీప్కే తదితరులు దిల్లీ ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, ముమ్మాటికీ దేశద్రోహపూరితమని ఆయన విరుచుకుపడ్డారు. బంగ్లాదేశ్ పరిణామాల నుంచి తాము ప్రేరణ పొంది భారత దేశంలో కూడా అదే రీతిలో ‘రెజీమ్ చేంజ’ (పాలన మార్పు) చేస్తామంటూ బాహాటంగా మాట్లాడిన మాటలపై కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరగడం, ప్రజాతీర్పు మేరకు ఒక కూటమి గెలవడం, మరొకటి ఓడిపోవడం నిరంతర ప్రజాస్వామ్య ప్రక్రియ. బంగ్లాదేశ్ తరహా విధ్వంసాన్ని, హింసను ప్రేరణగా తీసుకుని భారతదేశంలో పాలన మార్పు తెస్తామంటూ విద్రోహ శక్తులు ప్రకటించడాన్ని కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా అని ఆయన ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఇలాంటి దేశవ్యతిరేక నినాదాలు, కుట్రలు జరుగుతుంటే కాంగ్రెస్ పార్టీ ఎందుకు మౌనం వహిస్తోందని నిలదీశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎప్పుడూ చేతిలో రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరుగుతూ రాజ్యాంగ పరిరక్షణ గురించి ప్రసంగాలు చేస్తుంటారని, కానీ రాజ్యాంగ విలువలనే కాలరాస్తున్న ఈ శక్తులపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఒకవైపు చేతిలో జాతీయ జెండా పట్టుకుని, మరోవైపు విదేశీ నిధుల అండతో దేశంలో అల్లర్లు, అరాచకం సృష్టించేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను దేశ ప్రజలంతా నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. దేశ ప్రజలకు అత్యంత నమ్మకమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు, న్యాయవ్యవస్థ, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) లాంటి సర్వోన్నత సంస్థలను నిర్వీర్యం చేసేందుకు రాహుల్ గాంధీ, అర్బన్ నక్సలైట్లు, ‘టుకుడేటుకుడే’ గ్యాంగ్ పక్కా వ్యూహంతో పనిచేస్తున్నాయని ఆరోపించారు. వీరి పోరాటం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆరఎస్ఎస్ లేదా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌లకు వ్యతిరేకం కాదని, కేవలం అక్రమ మార్గాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడమేనని తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో జరిగే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఎన్నటికీ గెలవలేరని స్పష్టమయ్యాక దేశంలో అశాంతిని ప్రేరేపించి అధికారం దక్కించుకోవడానికి కాంగ్రెస్ నేతలు దేశద్రోహ శక్తులతో చేతులు కలిపారని రామచందర్ రావు విమర్శించారు. స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ నేడు నక్సలైట్ ఆలోచనా విధానాలకు దిగజారి దేశద్రోహుల పక్కన నిలబడటం సిగ్గుచేటన్నారు.



# రేపు బతుకమ్మ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డుల పంపిణీ

- ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు

**హైదరాబాద్, అక్టోబర్ 16 :**

హైదరాబాద్ శిల్పకళా వేదికలో శనివారం ఉదయం 11 గంటలకు బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డుల వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దిల్ రాజు పరిశీలించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్, ఎఫ్‌డీసీ ఎండీ డాక్టర్ జి.ముకుంద రెడ్డి, క్రియేటివ్ డైరెక్టర్ కొండ రాజు, టీజీఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు, ఐఅండ్‌పీఆర్ అదనపు సంచాలకుడు డి.ఎస్.జగన్, యాంకర్ ఉదయభాను తదితరులు పాల్గొన్నారు. ఈ ఛాలెంజ్‌కు ఎంపికైన 35 మంది యంగ్ ఫిల్మ్ మేకర్స్‌కు అవార్డులు అందజేస్తారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు, రోడ్లు ,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇతర ప్రజా ప్రతినిధులు, సినిమా రంగ ప్రముఖులు, తదితరులు పాల్గొంటారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో 2వ యంగ్ ఇండియా ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్ ఛాలెంజ్2026లో భాగంగా 5 కేటగిరీల పోటీలలో పాల్గొనేందుకు 2,670 మంది ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఎంట్రీల పరిశీలన, అవార్డులకు ఎంపికకు ప్రతి కేటగిరీకి ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. ఫిల్మ్స్, సాంగ్స్, ఫోక్ సాంగ్స్, ఇన్ఫ్లుయెన్సర్స్ కేటగిరీల్లో ప్రతి కేటగిరీలో మొదటి బహుమతిగా రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.2 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.లక్ష చొప్పున అందజేస్తారు. ఈ నాలుగు కేటగిరీలో ప్రతి కేటగిరీలో 5 కన్సొలేషన్ బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున ఇస్తారు. అలాగే 5వ కేటగిరీ ఆర్టికల్స్ అవార్డుల కింద ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.3 లక్షలు, రూ.2 లక్షలు, రూ.లక్ష చొప్పున అందజేస్తారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

**హైదరాబాద్, అక్టోబర్ 16 :**

ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు చేపట్టిన మహా ధర్నాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో సేవలందిస్తున్న దాదాపు 17వేల మంది వైద్యులు, ఏఎన్‌ఎంలు, పారా మెడికల్ సిబ్బంది న్యాయమైన హక్కుల కోసం సమ్మెబాట పట్టడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఉద్యోగుల్లో దాదాపు 70 శాతం మంది మహిళలే ఉన్నప్పటికీ వారికి కనీస వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్, ఉద్యోగ భద్రత వంటి ప్రాథమిక హక్కులను నిరాకరించడం దారుణమని మండిపడ్డారు. అత్యవసర వైద్య సేవలు అందించే వారిపై అదనపు పనిభారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జిల్లా కలెక్టర్లకు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతోనే ఈనెల 13 నుంచి ఉద్యోగులు విధులను బహిష్కరించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తన వంతు నిధులను సకాలంలో రాష్ట్రానికి విడుదల చేస్తున్నప్పటికీ నిర్వహణ బాధ్యత కలిగిన రాష్ట్రం మాత్రం తీవ్ర నిర్లక్ష్యం, తాత్సారం ప్రదర్శిస్తోందని విమర్శించారు.



# తిరంగా ర్యాలీకి ముందు సీజేపీ కన్వీనర్ అరెస్ట్

- వారం వ్యవధిలో రెండోసారి అభిజిత్ దీప్కే అదుపులోకి
- అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించొద్దని పోలీసుల హెచ్చరిక
- శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ముందస్తు చర్యలని వెల్లడి
- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో గతంలోనూ అరెస్ట్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 16:**

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్వీనర్ అభిజిత్ దీప్కేను ఢిల్లీ పోలీసులు శుక్రవారం ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. 'లెహ్రా దో తిరంగా' పేరుతో జాతీయ జెండా ర్యాలీ నిర్వహించేందుకు బయలుదేరడానికి కొద్ది నిమిషాల ముందు ఈ చర్య చేపట్టారు. తనను ఎందుకు అదుపులోకి తీసుకుంటున్నారని దీప్కే పోలీసులను ప్రశ్నించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యగా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

వారం రోజుల వ్యవధిలో దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇది రెండోసారి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో ఓటర్ల పేర్లను తొలగించారంటూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గతంలో నిరసన చేపట్టేందుకు ప్రయత్నించిన ఆయనను విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో తిరంగా ర్యాలీ నిర్వహించాలని సీజేపీ పిలుపునిచ్చింది. అయితే, ర్యాలీ చేపట్టవద్దంటూ అంతకుముందే దీప్కే నివాసానికి వెళ్లిన పోలీసులు నోటీసులు అందించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 163 కింద జారీ చేసిన ఈ నోటీసులో కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని పేర్కొన్నారు.

ర్యాలీకి న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ) అనుమతి ఇవ్వలేదని పోలీసులు స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ప్రదర్శన నిర్వహిస్తే అమల్లో ఉన్న ఆంక్షలను ఉల్లంఘించినట్లవుతుందని హెచ్చరించారు.




# తిరంగా మార్చ్‌పై ఢిల్లీలో ఉద్రిక్తత

- సీజేపీకి వ్యతిరేకంగా కన్నాట్‌ప్లేస్ వ్యాపారుల నినాదాలు
- ప్రధాని మోదీ, ఢిల్లీ పోలీసులకు వ్యాపారుల మద్దతు
- సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే, నేహా బోరా ముందస్తు అదుపులోకి
- నిరసనల్లో పాల్గొన్న విద్యార్థి సంఘాల సభ్యులనూ తీసుకెళ్లిన పోలీసులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 16:**

దేశ రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పిలుపునిచ్చిన 'తిరంగా మార్చ్' నేపథ్యంలో ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు చేరుకోవాలని సీజేపీ తన మద్దతుదారులకు పిలుపునిచ్చింది. ఈ నిరసనకు వ్యతిరేకంగా స్థానిక వ్యాపారులు కూడా రంగంలోకి దిగారు. కన్నాట్ ప్లేస్‌లోని పాలికా బజార్ వ్యాపారులు సీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, ఢిల్లీ పోలీసులకు మద్దతు తెలిపారు. పండగల సమయంలో వ్యాపారాలు జోరుగా సాగాల్సి ఉండగా నిరసనలతో ఇబ్బందులు సృష్టించడం ఏమిటని వ్యాపారులు ప్రశ్నించారు. ముంబైలోనూ పలువురు వ్యాపారులు సీజేపీ నిరసనలను వ్యతిరేకించినట్లు సమాచారం. మరోవైపు, తిరంగా మార్చ్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న సీజేపీ కన్వీనర్ అభిజిత్ దీప్కేను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు ఏఐఎస్ఏ నాయకురాలు నేహా బోరాను కూడా అదుపులోకి తీసుకున్నారు. కన్నాట్ ప్లేస్‌లో నిరసనకు దిగిన సీజేపీ మద్దతుదారులను పోలీసులు అక్కడి నుంచి తరలించారు. బారాఖంబా రోడ్డులో ఆందోళన చేపట్టిన వామపక్ష విద్యార్థి సంఘాల సభ్యులనూ అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఢిల్లీలో పలు ప్రాంతాల్లో నిరసనలు, పోలీసుల చర్యలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# బంగ్లాదేశ్ తరహా అస్థిరతకు కుట్ర?

- ఇండియా బ్లాక్, రాహుల్ గాంధీ, సీజేపీపై రాజ్‌నాథ్ సింగ్ ఆరోపణలు
- భారత్‌లో అశాంతి సృష్టించి అధికార మార్పిడికి ప్రయత్నిస్తున్నారని విమర్శ
- రాహుల్ ఓట్ల చోరీ ఆరోపణలు దివాళీ టపాసుల్లా తేలిపోయాయని ఎద్దేవా
- కాంగ్రెస్ పాలనలోని ఎమర్జెన్సీ, 1984 అల్లర్లను ప్రస్తావించిన రక్షణ మంత్రి
- రాజ్యాంగ సంస్థలను గౌరవిస్తూ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 16:**



భారత్‌లో బంగ్లాదేశ్ తరహా అస్థిర పరిస్థితులను సృష్టించి అధికార మార్పిడికి కుట్ర జరుగుతోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ఇండియా బ్లాక్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కలిసి దేశంలో అశాంతిని ప్రేరేపించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం యువతను తప్పుదోవ పట్టిస్తూ ఘర్షణలకు ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. వీధుల్లో నిరసనలు, ప్రభుత్వాలను మార్చేస్తామనే హెచ్చరికలతో దేశంలో గందరగోళం సృష్టించాలన్నదే వారి లక్ష్యమని ఆరోపించారు.

రాహుల్ గాంధీ చేసిన ఓట్ల చోరీ ఆరోపణలపైనా రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా స్పందించారు. హైడ్రోజన్ బాంబు పేలుస్తానన్న ప్రచారం చివరకు దివాళీ టపాసులా కూడా పేలలేదని ఎద్దేవా చేశారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు. 70 ఏళ్ల మహిళను రెండు చోట్ల ఓటరుగా చూపించారని, 35 ఏళ్ల మహిళను 124 ఏళ్ల వయసున్న ఓటరుగా చిత్రీకరించారని ఉదాహరణలు ప్రస్తావించారు. సాధారణ పౌరులను సైతం నకిలీ ఓటర్లుగా ప్రచారం చేస్తూ దేశానికి చెడ్డపేరు తెచ్చేందుకు ప్రయత్నించారని విమర్శించారు.

**కాంగ్రెస్ గత పాలనపైనా విమర్శలు**

రాజ్యాంగ సంస్థలను దెబ్బతీస్తున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను రాజ్‌నాథ్ సింగ్ తిప్పికొట్టారు. కాంగ్రెస్ పాలనలో విధించిన అత్యవసర పరిస్థితి, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, కరసేవకులపై కాల్పుల ఘటనలను ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాలని మాట్లాడుతున్న రాహుల్ గాంధీ, అదే రాజ్యాంగాన్ని జేబులో పెట్టుకుని అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నిస్తూ, గతంలో ఎన్నికల కమిషనర్ల నియామకాలు, వారికి కల్పించిన పదవుల అంశాలను ప్రస్తావించారు. బీజేపీ రాజ్యాంగ సంస్థలను గౌరవిస్తోందని స్పష్టం చేశారు.

**చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి**

ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ హింసాత్మక మార్గాలను ఆశ్రయిస్తోందని రాజ్‌నాథ్ ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగించేలా అశాంతిని ప్రోత్సహించడం సరికాదన్నారు. సమాజ్‌వాదీ పార్టీ మద్దతు లేకుండా అమేథీలో రాహుల్ గాంధీ గెలవగలరా అని ప్రశ్నించారు. సొంత పార్టీ కార్యాలయంలోనే దాడులు జరిగే పరిస్థితులున్న కాంగ్రెస్ ముందుగా తన అంతర్గత సమస్యలను సరిదిద్దుకోవాలని సూచించారు. నిరంతరం అడ్డంకులు సృష్టించే ధోరణిని విడనాడి, దేశాభివృద్ధి కోసం చర్చల మార్గాన్ని ఎంచుకోవాలని రాహుల్ గాంధీకి హితవు పలికారు.

# మోదీ ప్రభుత్వంలోనే మహిళా సాధికారత

- కాంగ్రెస్, 'ఇండి' కూటమి పార్టీలు మహిళా వ్యతిరేకులు
- తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో మహిళలపై పెరిగిన నేరాలు
- మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రామచందర్ రావు

**హైదరాబాద్, అక్టోబర్ 16 :**

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహిళా సాధికారతకు బాటలు వేస్తూ అనేక చారిత్రక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు మహిళలకు నిరంతరం అన్యాయం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. మోదీ పాలనలో పీఎం ఉజ్వల యోజన ద్వారా 11 కోట్లకు పైగా ఉచిత గ్యాస్ కనెక్షన్లు, జన్ ధన్ యోజన ద్వారా దాదాపు 32 కోట్ల మంది మహిళలకు బ్యాంకింగ్ సేవలు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా 3 కోట్ల మంది మహిళా రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సాయం అందాయని వివరించారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పా రెడ్డి అధ్యక్షతన మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం జరగగా రామచందర్ రావు ముఖ్య అతిథిగా, మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు, ఎంపీ రూప్ కుమారి చౌదరి విశిష్ట అతిథిగా ప్రసంగించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని దాదాపు పది కోట్ల మంది మహిళలకు ఉపాధి లభిస్తోందని, పీఎం ముద్ర యోజన, లఖ్‌పతి దీదీ, పీఎం మాతృవందన యోజన, ఈశ్రమ్ పోర్టల్, ఉమెన్ ఇన్ స్టార్టప్స్, శక్తి సదన్, స్వచ్ఛ భారత్ మిషన్, ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులు వంటి పథకాల ద్వారా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్న ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనని రామచందర్‌రావు వివరించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని (నారీశక్తి వందన్ అధినియం) ఆమోదింపజేస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్, ఇండి కూటమి పార్టీలు దానికి అడ్డంకులు సృష్టించాయని తీవ్రంగా మండిపడ్డారు. మహిళల పట్ల కాంగ్రెస్ అనుసరిస్తున్న ద్వంద్వ, మోసపూరిత వైఖరిని ఎండగడుతూ హైదరాబాద్‌లో వేలాదిమంది మహిళలతో 'మహిళా ఆక్రోశ్ యాత్ర'తోపాటు ఇందిరాపార్కు వేదికగా ధర్నా చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై రామచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మహిళా రక్షణ ప్రశ్నార్థకంగా మారిందని, మహిళలపై అఘాయిత్యాలు, నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2024లో మహిళలపై నేరాలకు సంబంధించి సుమారు 20 వేల కేసులు నమోదు కాగా 2025 నాటికి ఆ సంఖ్య 21 వేలకు చేరుకుందని, మహిళలపై నేరాల శాతం 3.16 శాతానికి పైగా పెరిగిందని గణాంకాలతో వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరినే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని మండిపడ్డారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ వైఫల్యాలపై మహిళా మోర్చా శ్రేణులు రాజీ లేని పోరాటం చేయాలని, అదే సమయంలో కేంద్ర పథకాలను ప్రతి గడపకూ చేర్చాలని పిలుపునిచ్చారు.



రూప్ కుమారి చౌదరి మాట్లాడుతూ దేశంలో పేద కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించుకోవడం గతంలో తీరని కలగా ఉండేదని, ప్రధాని మోదీ ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా నేడు లక్షలాది మంది నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చారని తెలిపారు. గతంలో ఎంపీ కోటా కింద ఒక లోక్‌సభ స్థానానికి ఏడాదికి కేవలం 25 గ్యాస్ కనెక్షన్లు మాత్రమే సిఫారసు చేసే పరిస్థితి ఉండేదని, నేడు ఏ సిఫారసు లేకుండానే ప్రతి నిరుపేద మహిళకు ఉజ్వల గ్యాస్ సిలిండర్‌ను అందించిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 2014కు ముందు బ్యాంకుల వైపు చూడలేని గ్రామీణ మహిళల కోసం జన్‌ధన్ ఖాతాలు తెరిపించి ఆర్థిక విప్లవానికి మోదీ తెరతీశారని ఆమె చెప్పారు. పారదర్శకమైన డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానాన్ని తీసుకొచ్చి నిధులు అక్కాచెల్లెళ్ల బ్యాంకు ఖాతాల్లోకే జమ చేసి దళారీ వ్యవస్థను అంతమొందించారని ప్రశంసించారు. పార్లమెంటు, అసెంబ్లీల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకున్నప్పటికీ బీజేపీ ఎల్లప్పుడూ మహిళలకు సముచిత స్థానం కల్పిస్తోందని తెలిపారు. జేఎన్‌యూ ఘటనలో 11 మంది ఆడబిడ్డలు న్యాయం కోసం ఫిర్యాదు చేస్తే 'నేను అమ్మాయిని.. పోరాడగలను' అని ప్రగల్భాలు పలికిన ప్రియాంక గాంధీ గానీ, రాహుల్ గాంధీ గానీ ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ఎంపీకి వ్యతిరేకంగా ఒక్క ముక్క కూడా మాట్లాడలేదని, వారి ద్వంద్వ నీతి బట్టబయలైందని మండిపడ్డారు. అలాంటి బాధితులకు మహిళా మోర్చా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కమలం వికసించి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో మహిళా మోర్చా కీలక పాత్ర పోషిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సంజయ్ రౌత్‌కు సుప్రీంకోర్టు షాక్

- సీజేఐపై వ్యాఖ్యలతో శివసేన యూబీటీ ఎంపీకి షోకాజ్ నోటీసులు
- జర్నలిస్ట్ నిఖిల్ వాగ్లేకూ నోటీసులు జారీ
- క్రిమినల్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్
- తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని రౌత్ ఆరోపణ.. జైలుకైనా సిద్ధమని ప్రకటన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 16:**

భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రౌత్‌తో పాటు జర్నలిస్ట్ నిఖిల్ వాగ్లేకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వీరిద్దరిపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) దాఖలు చేసిన క్రిమినల్ కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా రాజ్యాంగ సంస్థలపై దాడులు చేయడం దురదృష్టకరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. హక్కుల పరిరక్షణలో న్యాయస్థానాలు ఎప్పుడూ వెనకడుగు వేయలేదని స్పష్టం చేసింది. అయినప్పటికీ న్యాయవ్యవస్థపై విమర్శలు కొనసాగడం విచారకరమని పేర్కొంది.

**విపక్ష నేతలను కలవలేదంటూ వ్యాఖ్యలు**

అక్టోబర్ 12న ప్రతిపక్ష నేతల బృందాన్ని కలిసేందుకు సీజేఐ నిరాకరించిన నేపథ్యంలో సంజయ్ రౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ రాజకీయ కార్యక్రమాలకు న్యాయమూర్తులు హాజరవుతున్నారని, ముఖ్యమంత్రులు ఇచ్చే విందుల్లో పాల్గొంటున్నారని, ప్రతిపక్ష నేతలను మాత్రం కలవడం లేదని విమర్శించారు. జర్నలిస్ట్ నిఖిల్



వాగ్లే కూడా తన ఎక్స్ ఖాతాలో సీజేఐని ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని, న్యాయవ్యవస్థ తన న్యాయబద్ధమైన పరిమితులను దాటిందనే అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

**క్షమాపణ చెప్పిన వాగ్లే.. రౌత్ ఎదురుదాడి**

వివాదం తీవ్రం కావడంతో నిఖిల్ వాగ్లే క్షమాపణలు చెప్పారు. అయితే, తనను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని సంజయ్ రౌత్ ఆరోపించారు. తాను మాట్లాడటం ఆపబోనని, అవసరమైతే జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమని ప్రకటించారు. గతంలో పలువురు ప్రముఖులు, పదవీ విరమణ చేసిన ప్రధాన న్యాయమూర్తులు, ఇతర మాజీ న్యాయమూర్తులు, రాజకీయ నేతలు సుప్రీంకోర్టుపై వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. అలాంటప్పుడు తననే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారని ప్రశ్నించారు.

# విద్యార్థి సంఘాల ఎన్నికలతోనే ప్రజాస్వామ్యానికి పునాది

- రవాణా శాఖ మంత్రి పొన్నం
- ఆర్టీసీ ఎన్నికల్లో విజయం సాధించిన ఐక్య కూటమి నేతలకు సత్కారం

**హైదరాబాద్, అక్టోబర్ 16:**

ప్రజాస్వామ్యంలో ప్రతి స్థాయిలో ఎన్నికలు జరగడం ఎంతో కీలకమని, కార్మిక సంఘాల ఎన్నికల మాదిరిగానే విద్యార్థి సంఘాల ఎన్నికలు కూడా అత్యంత ముఖ్యమని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు, వారి హక్కులను కాపాడేందుకు ప్రజాస్వామ్యబద్ధమైన నాయకత్వం ఏర్పడాలని, తాను కూడా విద్యార్థి సంఘాల ఎన్నికల ద్వారానే రాజకీయాల్లోకి వచ్చానని ఆయన గుర్తు చేశారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో విజయం సాధించిన ఐక్య కూటమి (ఈయూ, టీఎంయూ, ఎన్ఎంయూ) ప్రతినిధులు శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్ లో మంత్రి పొన్నంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయం సాధించిన నేతలను మంత్రి అభినందించి సత్కరించారు.

**కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధికి ప్రాధాన్యం**

మంత్రి పొన్నం మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, సంస్థను లాభాల బాట పట్టించడం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలను తొందరపాటు నిర్ణయాలతో కాకుండా, నిర్మాణాత్మకంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆర్టీసీ విలీన ప్రక్రియకు సంబంధించి అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సమన్వయంతో చర్చించి భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కార్యాచ రణ రూపొందించాలని కోరారు.

**బకాయిల కోసం భూముల విక్రయానికైనా సిద్ధం**

ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బకా యిలను చెల్లించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. అవసరమైతే సంస్థకు చెందిన విలువైన భూములను విక్రయించిసరే రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను తీరుస్తాం. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లాను అని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన సీసీఎస్ బకాయిలతో పాటు ఇతర పెండింగ్ సమస్యలను కోర్టు తీర్పునకు అనుగుణంగా చట్టబద్ధంగా పరిష్కరిస్తామన్నారు.






# మేడిపల్లిలో శ్రీ శ్రీ వాణి ఎంటర్ప్రైజెస్ ప్రారంభం

- ప్రారంభించిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి, బండారి రవీందర్, మాజీ కార్పొరేటర్లు కే. సుభాష్ నాయక్, ఎంపల్ల అనంతరెడ్డి
- పేపర్ ప్లేట్లు, డిస్పోజల్ ఐటమ్స్ హోల్ సేల్ ధరలకే అందించాలి

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్, అక్టోబర్ 16:** కస్టమర్లకు నాణ్యమైన వస్తువులను అతి తక్కువ ధరలో అందించి ప్రజల ఆధారాభిమానాన్ని పొంది వ్యాపారంలో దినదినా భివృద్ధి చెందాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బండారి రవీందర్ తెలిపారు. ఈ మేరకు బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని తొమ్మిదవ డివిజన్ పంచవటి కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ శ్రీ వాణి ఎంటర్ప్రైజెస్ ను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బండారి రవీందర్ మాజీ కార్పొరేటర్లు కేతావత్ సుభాష్నాయక్, ఎంపల్ల అనంతరెడ్డి చేతులమీదుగా ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వ్యాపార రంగంలో అభివృద్ధి సాధించాలని నిర్వాహకులను ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానికంగా నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటవడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడటమే కాకుండా, తమకు ఉన్న నైపుణ్యాలు, ఆలోచనలతో స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. చిన్నతరహా పరిశ్రమలు స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. మేడిపల్లి పంచవటి కాలనీలో ప్రారంభమైన శ్రీ శ్రీ వాణి పేపర్ ప్లేట్స్ అండ్ డిస్పోజబుల్ ఐటమ్స్ కంపెనీ నాణ్యమైన ఉత్పత్తులతో వినియోగదారుల ఆదరణ పొందుతూ, వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని వారు ఆకాంక్షించారు. నూతన సంస్థ ప్రారంభంతో నిర్వాహకుల్లో ఆనందం నెలకొంది. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మదర్ థెరిస్సా మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మదర్ థెరిస్సా మండల సమాఖ్య ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు.మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు మండల ఎంపీడీఓ, తహసీల్దార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మను పేర్చడం వెనుక ఉన్న గొప్పతనాన్ని వివరించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం మహిళా సంఘాల సభ్యులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటం ఆడుతూ సందడి చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ సిబ్బంది, సీసీలు పెద్దపాక వెంకటేశ్వరరావు, మల్లయ్య, వెంకటేష్, అచ్యుత, నాగేంద్రమ్మ, ఎంఎస్ అకౌంటెంట్ జయమ్మ, సీఏ లక్ష్మి , వీఓఏలు నాగమణి, మన్నే ఉమ, శ్రీలక్ష్మి , పద్మ, లావణ్య, పుష్ప తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జూనియర్ సివిల్ జడ్జి మనీషా అనంత్ రెడ్డికి ఘన సన్మానం...

- మహిళలకు, యువతకు ఆదర్శంగా నిలిచిన మనీషా...
- మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్
- శంకర్ పల్లి, మోకిల పీఏసీఎస్ చైర్మ న్ లు బొల్లారం వెంకటరెడ్డి, గంద్ర సత్యం



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** మహాలింగపురం గ్రామానికి చెందిన గండు మనీషా అనంత్ రెడ్డి తెలంగాణ హైకోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన నేపథ్యంలో శంకర్ పల్లి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, శంకర్ పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, మోకిల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గంద్ర సత్యం తదితరులు పాల్గొని మనీషా అనంత్ రెడ్డిని సత్కరించారు.

**మహిళలకు, యువతకు ఆదర్శం...**

మనీషా రెడ్డి నేటి యువతకు, మహిళలకు ఆదర్శమని కొనియాడారు. తెలంగాణ హైకోర్టు ప్రకటించిన జూనియర్ సివిల్ జడ్జిల ఫలితాల్లో మనీషా ప్రతిభ కనబరిచి న్యాయమూర్తిగా ఎంపిక కావడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. న్యాయవిద్యలో ఎంతో కష్టపడి చదివి, అనేక వ్యయప్రయాసలకోర్చి ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆమె పట్టుదల, కృషి శంకర్ పల్లి ప్రాంతంలోని మహిళలకు, యువతకు ఆదర్శంగా నిలుస్తాయనన్నారు.

**మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి...**

శంకర్ పల్లి పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, మోకిల పీఏసీఎస్ చైర్మన్ గంద్ర సత్యం మాట్లాడుతూ. గండు మనీషా అనంత్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. న్యాయ వ్యవస్థలో తనదైన ముద్ర వేస్తూ ప్రజలకు న్యాయం చేకూర్చాలని కోరుకున్నారు. ఆమె సాధించిన విజయం భవిష్యత్తు తరాల విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మనీషా అనంత్ రెడ్డికి, ఆమె కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి, కౌన్సిలర్ లలిత మోహన్ రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ ప్రశాంత్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నగర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- మాజీ కార్పొరేటర్ బండి రమ్య సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు
- బతుకమ్మల అలంకరణ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు




**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** గణేష్ నగర్ కాలనీ ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ నెల 18వ తేదీ ఆదివారం గణేష్ నగర్ కాలనీలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు 16వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బండి రమ్య సతీష్ గౌడ్ తెలిపారు.బండి రమ్య సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వేడుకల్లో కాలనీలోని ఆడపడుచులందరూ రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని వారు కోరారు. మహిళలు తమ ఇళ్ల వద్ద బతుకమ్మ ఆడుకున్న అనంతరం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్దకు చేరుకుని సామూహికంగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**బతుకమ్మల అలంకరణకు నగదు బహుమతులు**

ఈ వేడుకల్లో భాగంగా అత్యంత అందంగా అలంకరించి తీసుకువచ్చిన బతుకమ్మలకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నారు. మొదటి బహుమతిగా రూ.3,116/-, రెండో బహుమతిగా రూ.2,116/-, మూడో బహుమతిగా రూ.1,116/- నగదు అందించనున్నారు. బతుకమ్మలను పేర్చి వేడుకల్లో పాల్గొనే మహిళలందరికీ బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ ఐక్యంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కాలనీ పెద్దలు, కమిటీ సభ్యులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ...

## చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య చేతుల మీదుగా పంపిణీ...



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల మండల, మున్సిపాలిటీ పరిధికి చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ. 37,00,592 విలువైన కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను స్థానిక శాసన సభ్యులు కాలే యాదయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాల ద్వారా అండగా నిలుస్తోందని తెలిపారు. ఈ పథకాలు ఆడపిల్లల వివాహ సమయంలో కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్ పల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి మృతి

## ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపి రంజిత్ రెడ్డి నివాళులు



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి (73) శుక్రవారం ఉదయం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వెంకట్రాం రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి శంకర్ పల్లి పట్టణ పరిధిలోని సాయి కాలనీలోని మృతుని నివాసానికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మండల వైస్ ఎంపీపీగా ఆయన చేసిన అభివృద్ధి సేవలు మరువలేనివని ఎమ్మెల్యే మాజీ ఎంపీ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల, మున్సిపల్ నాయకులు ఉన్నారు.

# మోకిల పోలీస్ స్టేషన్ ను సందర్శించిన డిసిపి యోగేష్ గౌతమ్

## పలు రికార్డులు పరిశీలన...



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** చేవెళ్ళ జోన్ డీసీపీ యోగేశ్ గౌతమ్ శుక్రవారం మోకిల పోలీస్ స్టేషన్ సందర్శించారు. మోకిల పోలీస్ స్టేషన్ సందర్శించి, పోలీస్ స్టేషన్ యొక్క రికార్డులు పరిశీలించి, పలు కేసుల దర్యాప్తు విషయంలో ఈ సాక్ష్య, సిసిటివిఎస్, టెక్నికల్ ఎవిడెన్స్ ల విషయంలో తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. సందర్శన సమయంలో మోకిల ఎస్హెచ్ఓ శ్రీనివాస్ రెడ్డి, అడ్మిన్ ఎస్ఐ లక్ష్మణ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా తాండూరులో సైకిల్ ర్యాలీ



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా పాల్గొని తాండూరు పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తాండూరు డీఎస్పీ నర్సింహయ్య, తాండూరు డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి ఈ ర్యాలీ నిర్వహించారు. ఇంద్రాచౌక్ నుంచి సెయింట్ మార్క్స్ స్కూల్ వరకు సైకిల్ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమం ద్వారా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలు, దేశ రక్షణలో వారు అందించిన అమూల్యమైన సహకారాన్ని ప్రజలకు తెలియజేశారు. ముఖ్యంగా విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో పాటు పోలీస్ శాఖ పట్ల గౌరవభావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అదనపు ఎస్పీ తెలిపినారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా అదనపు ఎస్పీ తెలిపారు.

# మద్దికుంట గ్రామానికి 17 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి 17 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు గ్రామ సర్పంచ్. మనిషా రామస్వామి తెలిపారు, లబ్ధిదారులకు ఆర్డర్ కాపీలను అందజేశారు, లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామని అన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ముత్యాల రాజు, వార్డ్ మెంబర్లు దుంపల ప్రేమ్ కుమార్, శ్యామల, లింగమాచారి, గ్రామ కార్యదర్శి బండి నరేష్, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు దుంపల బాలరాజ్, నర్సారెడ్డి, కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు రేకులపల్లి సంతోష్,రెడ్డి, బిజెపి నాయకులు శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నస్వామి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం టెండర్ ప్రకటన

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** సమస్త భక్త జనులకు, వ్యాపారవేత్తలకు, తెలియజేయునది శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం టెండర్ ప్రకటన , మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామం నందు కొబ్బరికాయలు , కిరాణ పూసవేర్లు , హోటల్ , టెంట్ హౌస్ నిర్వహించుటకు గాను ఒక 'సంవత్సరం కాల పరిమితికి గాను తేది : 23 -10 -2026 శుక్రవారం రోజున ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలము కలదు ఇట్టి వేలము ఆలయ ఈవో రవీందర్ గుప్తా, ఆలయ కమిటి చైర్మన్ శనిగరం కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడును. ఆసక్తిగలవారు పాల్గొనవలసినదిగా కోరుతున్నాము. వేలము షరతులు వేలం సమయం యందు తెలుపబడును అని ఆలయ ఈవో రవీందర్ గుప్తా ప్రకటనలో తెలిపారు.

# లక్కీ డ్రాలో పరిగి బార్‌కు సోమలింగం.. కొడంగల్ బార్‌కు అనిల్ ఎంపిక




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన లక్కీడ్రా ద్వారా పరిగి, కొడంగల్ బార్లకు ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఈ లక్కీ డ్రాలో పరిగి బార్‌కు కే.సోమలింగం, కొడంగల్ బార్‌కు వర్కాల అనిల్ ఎంపికయ్యారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ లక్కీ డ్రాను అదనపు కలెక్టర్ వెంకట చారి తీశారు. లక్కీ డ్రా ద్వారా పరిగి, కొడంగల్ బార్లకు ఎంపికైన వారి వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా ఈర్ల సంతోష్



**రాజముద్ర న్యూస్, తాండూర్:** మంచిర్యాల జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా తాండూర్ మండలానికి చెందిన ఈర్ల సంతోష్ నియమితులయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆదేశాల మేరకు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల ముఖేష్ గౌడ్ సూచనలతో, జిల్లా అధ్యక్షుడు ఆకుల అశోక్ వర్ధన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శిగా నియమితులైన ఈర్ల సంతోష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేస్తానని, పార్టీ అధిష్ఠానం నిర్ణయాలను పాటిస్తూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల ముఖేష్ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నౌనూరి సుధీర్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల అశోక్ వర్ధన్‌కు ఈర్ల సంతోష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

**రాజముద్ర న్యూస్, తాండూర్:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన కుట్టుమిషన్లను శుక్రవారం తాండూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మైనార్టీ మహిళలకు సర్పంచ్ ముడిమడుగుల సురేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం మైనార్టీ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వాలంబన సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ ఈసా, ముస్కె సాగర్, సర్వర్ బేగ్, కంపెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి కోపానికి కారణం మనలో సనాతన ధర్మం న్యాయం లోపించడమే

- ఎలినీనో ప్రభావం తగ్గి, దేశంలో వర్షా లు పడాలని చండీ హోమం..
- శంకర్ పల్లి సేవ ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్ నరేష్ కుమార్
- క్రిష్ణగిరి పాదాలగుట్ట ఆలయ క్షేత్రంలో ఆధ్యాత్మిక సందడి




**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ప్రకృతి వనరులను దోపిడీ చేస్తున్న స్వార్థపరుల కారణంగానే దేశంలో సనాతన ధర్మానికి భంగం కలిగిందని, అందుకే ఎలినినో ప్రభావానికి నేడు దేశమంతా ఆందోళనకు గురైపోతుందని తెలంగాణ భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక సంస్థ, శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్ నరేష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోది 25 సంవత్సరాల నీతి పాలన సందర్భంగా ఎలి నీనో వేడి తుఫాన్ తగ్గాలని, సంకల్పంతో ధార్మిక సంస్థ, శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుబ్బడి పపత్తెపురంలోని క్రిష్ణగిరి పాదాలగుట్ట శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రంలో వేద పండితులు కేదార్నాథ్ చారి వేదమంత్రోత్సరాల మధ్య చండీ హోమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ...ఈ విజయదశమి నుండి ప్రజలు, రైతులు, నిరుపేదలందరూ కూడా ఎలాంటి కష్టన ష్టాలకు గురికావద్దన్న ఆశయంతో ఈ చండీ హోమాన్ని పవిత్రమైన దేవీ నవరాత్రుల లో చేయడం అదృష్టంగా భావి స్తున్నానని తెలిపారు. ప్రధాని మోదీ నిజాయితీ పాలన వల్ల ఉగ్రవాదుల దాడికి నేడు భారత దేశ ప్రజలు గురి కావడం లేదని, అలాగే సనాతన ధర్మాన్ని, కాషాయ జెండా గొప్పత నాన్ని, రామ్ మందిర్ నిర్మాణం ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన ధీరుడు మోదీ అని నరేష్ కుమార్ కొనియాడారు. మళ్లీ ఒకప్పటి రామరాజ్యం పూర్తిగా రావాలంటే మోడీ పాలనతోనే సాధ్యమని తెలిపారు. కరోనా వేల రెండు సంవత్సరాలు దీక్ష తీసుకొని మన దేశ ప్రజలను కాపాడటమే కాక, ఇతర దేశాలకు కూడా అండగా ఉన్న ఆయన గొప్పత నాన్ని ప్రపంచం గుర్తించిన విషయాన్ని నరేష్ కుమార్ మరోసారి గుర్తు చేశారు. ప్రతి భారత యువతి, యువకులు చత్రపతి శివాజీ లా స్వామి వివేకానందలా, రుద్రమదేవిలా, ఝాన్సీ లక్షి బాయిలా, ఒక జిజాబాయిలా మారినప్పుడే మన దేశం హిందూ రాజ్యాంగా ప్రపంచాన్ని శాసించే స్థాయిలో కీర్తిని సాధిస్తుందని తెలపడం జరిగింది.

**గోమాత మన ఆరాధ్య దైవం...**

గోవులు ఉంటేనే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని, కను మరుగు కాకముందే గోరక్షణ చేయాల్సిన అవసరం తప్పక ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆర్ రామ లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, భాజపా ఎండోమెంట్ సేల్ ధార్మిక సంస్థ చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ సి జయరాం రెడ్డి, శంకర్ పల్లి మండలం కన్వీనర్ పద్మాకర చార్యులు, శంకర్ పల్లి మున్సిపల్ కన్వీనర్ వివేంద్ర చారి, నవాపేట్ మండల్ కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, కోకన్వీనర్ కేదారి చారి నాథ్, సేవా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్, గ్రామస్తులు జంగయ్య ముదిరాజ్, భూపతి రెడ్డి, ఆర్ రాజు, రాములు గౌడ్, చరణ్ గౌడ్, హరికృష్ణ, ఆర్ నీల జంగయ్య, శ్రీశైలం గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్, బైండ్ల జగదీష్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాతల శివశంకర్ కుటుంబానికి ఎమ్మార్పీఎస్ రూ.50 వేల సహాయం

**మండల ఉపాధ్యక్షుడు దాసరి నాగేష్ చేయూత అభినందనీయం...**





**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** సామాజిక సేవలో భాగంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మరోసారి తమ ఉదారతను చాటుకున్నారు. బ్యాతల శివశంకర్ మాదిగ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు. ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు దాసరి నాగేష్ ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సహాయాన్ని పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ చేతుల మీదుగా అందజేశారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న వారికి సహాయం చేయాలనే సంకల్పంతో దాసరి నాగేష్ ముందుకు వచ్చి రూ.50 వేల ఆర్థిక సాయం అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, అవసరమైన సమయంలో ఆర్థిక తోడ్పాటు అందించడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్ కుమార్, మండల అధ్యక్షుడు లింగం సాయి మాదిగ, శంకర్ పల్లి మున్సిపల్ అధ్యక్షుడు కటికే మోహన్ శ్రీనివాస్ తదితరులు దాసరి నాగేష్‌ను అభినందించారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి బాధితుడికి ఆర్థిక సహాయం అందించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్నవారికి తోడ్పాటు అందించే కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. బాధితులకు సహాయం చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.

# జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నాకాబందీ నిర్వహణ



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాల కట్టడి, రహదారి భద్రతను పటిష్టం చేయడం లక్ష్యంగా జిల్లా పోలీస్ అధికారులు తమ తమ పోలీస్ స్టేషన్ల పరిధిలో గురువారం రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు విస్తృతంగా నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు మూడు డివిజన్ల పరిధిలో 20 పోలీస్ స్టేషన్లకు సంబంధించిన 36 తనిఖీ కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలతో పాటు భారీ వాహనాలను తనిఖీ చేసి, వాహనదారుల పత్రాలు, వాహనాల వివరాలను పరిశీలించారు.

**వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**

**నాకాబందీ వివరాలు:**

| | |
|---|---|
| **మొత్తం తనిఖీ చేసిన వాహనాలు:** | **1,677** |
| **డీడీ కేసులు:** | **71** |
| **ఈ-పెట్టి కేసులు:** | **79** |

నాకాబందీ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగింది . వాహనదారుల ధ్రువపత్రాలు, వాహనాల వివరాలను పరిశీలిస్తూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీస్ అధికారులు నిఘా పెట్టడం జరుగుతుంది. ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలి. మద్యం సేవించి వాహనాలు నడపకూడదు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రాధాన్యత. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా పోలీస్ శాఖ నిరంతరం తనిఖీలు, నిఘా కార్యక్రమాలు కొనసాగిస్తుంది. ప్రజలు పోలీసులకు సహకరించి సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పోలీస్ అధికారులు తెలియజేయడం జరిగింది.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ బతుకమ్మ పాటలతో పండుగ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు పోలీస్ కార్యాలయంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. పోలీస్ అధికారులు, మహిళా పోలీస్ సిబ్బంది, ఇతర సిబ్బంది సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి, పూర్వ వైభవానికి ప్రతీక. మన రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు, వాటి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రతకు నిరంతరం కృషి చేస్తున్న సిబ్బంది, ఇటువంటి పండుగల ద్వారా సంప్రదాయాలను గౌరవిస్తూ పరస్పర స్నేహభావం, ఐక్యతను మరింత పెంపొందించుకోవడం అభినందనీయమని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే బతుకమ్మ వేడుకలు పోలీస్ కార్యాలయంలో ఆనందోత్సావాల మధ్య ఘనంగా ముగిశాయి.ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీన, ఉమెన్ ఇన్స్పెక్టర్ ప్రమీల, ఇతర అధికారులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# నా జాగా నా ఇష్టం: నిర్మాణ దారుడు

- కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లో అక్రమ నిర్మాణం
- అక్రమ నిర్మాణాలదే రాజ్యమా..? స్థానికులు

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ (కేపీహెచ్‌బీ) 9వ ఫేజ్‌లో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ ప్రభుత్వ నిబంధనలను అపహాస్యం చేస్తున్నాయి. స్థానికంగా ఓ నిర్మాణదారుడు కేవలం స్టిల్ట్ ప్లస్ 2 అంతస్తులకు మాత్రమే అధికారిక అనుమతులు పొంది, సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ నిబంధనలను తుంగలో తొక్కుతూ అదనంగా మరో నాలుగున్నర అంతస్తులు అక్రమంగా నిర్మిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. నా జాగా నా ఇష్టం అనే విధంగా అక్రమ నిర్మాణ దారుడు వ్యవహరిస్తుంటే ఆకాశమే హద్దుగా సాగుతున్న ఈ అక్రమ నిర్మాణాన్ని సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అసలు ఇంతటి భారీ స్థాయిలో అక్రమ నిర్మాణం అధికారుల కనుసన్నల్లోనే నడుస్తోందా, లేక కాసుల కక్కుర్తితో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా అనే ప్రశ్నలు స్థానికుల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. ఈ అక్రమ వ్యవహారంలో ఎవరి వాటా ఎంత, ఇందులో ఉన్నతాధికారుల ప్రత్యక్ష జోక్యం ఉందా లేక వారి పేరు చెప్పి కిందిస్థాయి సిబ్బందే అందినకాడికి దండుకుని మొత్తం నొక్కేస్తున్నారా అనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే హైదరాబాద్ మహానగరం తీవ్రమైన భూగర్భ జలాల కొరతతో, తాగునీటి సమస్యతో అల్లాడుతున్న తరుణంలో, ఇలాంటి బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోయడం భవిష్యత్తులో పెను ప్రమాదానికి దారితీస్తుందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతూ, తమ సొంత జేబులు నింపుకుంటున్న టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొందరు అవినీతి చీడపురుగులను తక్షణమే ఏరివేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ సిఎంసి అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న బిల్డర్‌పై, వారికి సహకరిస్తున్న అవినీతి అధికారులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# రెవెన్యూ పనుల పురోగతిపై ట్రైనీ కలెక్టర్ సమీక్ష



**రాజముద్ర న్యూస్, తాండూర్:** మండలంలోని రెవెన్యూ కార్యనిర్వాహక పనుల నిర్వహణ తీరుపై ట్రేని కలెక్టర్ విలాయత్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం తాండూర్ మండల తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ జ్యోత్స్న, రెవెన్యూ కార్యాలయ సిబ్బందితో రెవెన్యూ శాఖ పనుల పురోగతిపై సమీక్షించారు.

# హిమాయత్‌నగర్ 60 గజాల బాధితుల దీక్ష విరమణ...

- 100 రోజులకు పైగా న్యాయం కోసం నిరాహార దీక్ష...
- భాదితుల కోసం భీమ్ భరత్ ప్రత్యేక చొరవ, రెవెన్యూ మంత్రితో భేటీ....
- భీమ్ భరత్ హామీతో దీక్ష విరమించిన బాధితులు...

**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** న్యాయం కోసం నినదించిన గొంతులు.. హక్కుల కోసం అలుపెరగని పోరాటం.. వంద రోజులకు పైగా సాగిన ఆకలి దీక్ష! ఎండ తీవ్రతను లెక్కచేయలేదు.. వర్షాన్ని చూసి వెనకడుగు వేయలేదు.. పండుగల ఆనందాన్నీ పక్కనపెట్టారు.. తమకు న్యాయం జరగాలనే ఒకే ఒక్క ఆశతో నిరాహార దీక్షను కొనసాగించారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ సర్వే నంబర్ 151లో 60 గజాల స్థలాలకు సంబంధించిన సమస్యపై పోరాడుతున్న బాధితులకు శుక్రవారం శుభ పరిణామం ఎదురైంది. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీం భరత్ చొరవతో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన బాధితులకు న్యాయం చేస్తామన్న హామీ లభించింది.

**వంద రోజుల నిరీక్షణ.. పేదల కన్నీటి వ్యథ...**

రోజులు గడుస్తున్నాయి... దీక్ష కొనసాగుతోంది... అయినా సమస్యకు పరిష్కారం కనిపించకపోవడంతో బాధితుల ఆవేదన అంతకంతకూ పెరిగింది. తమకు న్యాయం చేయాలంటూ ఎన్నో కష్టాలను భరిస్తూ పోరాటాన్ని కొనసాగించారు. ఈ నేపథ్యంలో బాధితుల సమస్యను భీం భరత్ మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. బాధితులతో కలిసి మంత్రిని కలిసిన ఆయన, వారి ఇబ్బందులను వివరించడంతో పాటు న్యాయం చేయాలని కోరారు.



**బాధితుల గోడు విన్న మంత్రి....**
**న్యాయం చేస్తామని హామీ...**

వంద రోజులకు పైగా నిరాహార దీక్ష చేస్తున్న బాధితులు తమ పేదరికాన్ని, కష్టాలను, ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి విన్నవించారు. వారి విజ్ఞప్తులపై స్పందించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి, హిమాయత్‌నగర్ 60 గజాల బాధితులకు అతి త్వరలో న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. దీంతో తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశ బాధితుల్లో చిగురించింది.

**భీమ్ భరత్ చొరవతో దీక్షకు ముగింపు...**

మంత్రి హామీ అనంతరం భీం భరత్ నిరాహార దీక్ష స్థలికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. మంత్రితో జరిగిన భేటీ వివరాలను వారికి తెలియజేసి, ఇచ్చిన హామీపై భరోసా కల్పించారు. ఆయన విజ్ఞప్తితో బాధితులు వంద రోజులకు పైగా కొనసాగిస్తున్న నిరాహార దీక్షను విరమించారు. తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, హామీ లభించేలా కృషి చేసిన భీం భరత్‌కు బాధితుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మాజీ అధ్యక్షులు మానయ్య, మొయినాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సత్య నారాయణ, మున్సిపల్ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ భాస్కర్, మల్లేష్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, హిమాయత్ నగర్ మాజీ సర్పంచ్, కౌన్సిలర్ లు , గణేష్ గౌడ్, కరణ్, బిక్షపతి, చిలుకూరు రాజు, పార్టీ సీనియర్ లీడర్లు, హిమాయత్ నగర్ గ్రామస్తులు ఉన్నారు.

# దుర్గామాత సన్నిధిలో భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



**రాజముద్ర న్యూస్, తాండూర్:** దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మాదారం టౌన్షిప్ లోని కోదండ రామాలయంలో నెలకొల్పిన దుర్గామాత విగ్రహం వద్ద సరస్వతీ మాత అవతారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమ పూజలు చేపట్టారు. వేద పండితులు ముద్దు అవధూత శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళకరమైన ప్రార్థనల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కుంకుమ పూజలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



**రాజముద్ర న్యూస్, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ పట్టణంలోని బట్టుపల్లి చౌరస్తాలో మున్నూరుకాపు సంఘం సిర్పూర్ నియోజకవర్గ మహిళా కమిటీ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు సుంకరి తిరుపతి, ప్రధాన కార్యదర్శి గోలెం వెంకటేశం, తాలూకా మహిళా అధ్యక్షురాలు ఎమ్మాజీ శారద నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం కుల పెద్దలు పెద్దపల్లి కిషన్‌రావు, తాలూకా మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి కర్ల లావణ్య, ఉపాధ్యక్షురాలు పెద్దపల్లి అనిత, ఎమ్మాజీ సంతోష్, గజ్జి మహేష్, నాగేశ్వరరావు, కావేటి మనోహర్, కావేటి సబిత, ఆసిఫాబాద్ తాలూకా అధ్యక్షుడు గాజుల జక్కయ్య, కోశాధికారి మణికొండ వెంకటేష్, పుప్పాల శ్రీనివాస్, గడ్డల సురేష్, మిట్ట తిరుపతి, గాజుల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఐడీఎల్ చెరువు (రంగధాముని చెరువు) వద్ద బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం రంగధాముని చెరువు వద్ద జరుగుతున్న బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు పెద్ద ఎత్తున పాల్గొని అంగరంగ వైభవంగా జరుపుకుంటున్న నేపథ్యంలో, వేడుకలకు వచ్చే మహిళలకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బతుకమ్మ వేడుకలకు వచ్చే ప్రజలకు తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా కల్పించాలని సూచించారు. అదేవిధంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖల అధికారులు నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు.



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. బతుకమ్మ వేడుకలు విజయవంతంగా నిర్వహించుకోవాలని, మహిళలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, వెంకటేష్ వివిధ శాఖలకు చెందిన అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం పరిధిలో బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగు రంగుల పూలతో తీర్చిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా ఆడారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పీడీ రాజు, భాగ్యలక్ష్మి సీఓ, కౌన్సిలర్ స్వాతి, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొని సంబరాలను ఘనంగా నిర్వహించారు.

# దివ్యాంగుల ఆర్థికాభివృద్ధికి సెర్ప్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కృషి

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో జీవిస్తూ స్వయం ఉపాధి రంగంలో రాణించాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సెర్ప్ సంస్థ యొక్క సహకారంతో నిరంతరం కృషి చేస్తోందని ఫౌండేషన్ టెర్రటరీ మేనేజర్ రవిప్రకాష్ తెలిపారు. రామారెడ్డి మండల కేంద్రంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం దివ్యాంగులకు స్వయం ఉపాధి పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ శిక్షణ ద్వారా దివ్యాంగులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని స్వంతంగా వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా స్వావలంబన సాధించగలరని నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రభుత్వ పథకాలు, స్వయం ఉపాధి అవకాశాలపై వారికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది మాట్లాడుతూ, దివ్యాంగులను సమాజంలో ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడం కోసం ఫౌండేషన్ ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. దివ్యాంగులు కూడా ఇతరుల మాదిరిగానే ప్రతిభ కలిగిన వారేనని, సరైన అవకాశాలు, మార్గదర్శకత్వం కల్పిస్తే వారు విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగగలరని పేర్కొన్నారు. అనంతరం డిఆర్ రామారెడ్డి మండల సమాఖ్య ఏపిఎం పద్మావతి డిఆర్ డిఏ తరపున దివ్యాంగుల అభివృద్ధికి సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమం తరువాత దివ్యాంగులకు గ్రాంట్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ గ్రాంట్లు వారి స్వయం ఉపాధి వ్యాపారాల ప్రారంభానికి ఎంతో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాల ఆర్థిక స్థితినిమెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కామారెడ్డి జిల్లా క్లస్టర్ కో – ఆర్డినేటర్ ప్రశాంత్, మండల సమాఖ్య క్లస్టర్ కో – ఆర్డినేటర్లు, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.



# 'క్రేజీ కల్యాణం'కు పాజిటివ్ టాక్!




**హైదరాబాద్, అక్టోబరు 16 :** అనుపమ పరమేశ్వరన్, అఖిల్ రాజ్, తరుణ్ భాస్కర్, వీకే నరేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన కుటుంబ కథాచిత్రం 'క్రేజీ కల్యాణం' ప్రేక్షకుల ముందుకొచ్చింది. బద్రప్ప గాజుల దర్శకత్వం వహించిన ఈ సినిమాను ఆరో సినిమాస్ పతాకంపై బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మించారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించగా, శ్యామ్ దుపటి ఛాయాగ్రహణం, శ్రవణ్ కటికనేని కూర్పు బాధ్యతలు నిర్వహించారు. ప్రేమ, పెళ్లి, కుటుంబ బంధాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబరు 16న విడుదలైంది. ఒక రోజు ముందుగానే ప్రీమియర్ ప్రదర్శనలు ప్రారంభం కావడంతో సినిమా చూసిన ప్రేక్షకులు సామాజిక మాధ్యమాల్లో తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. 'క్రేజీ కల్యాణం' ప్రథమార్ధం ప్రేక్షకులను ఆకట్టుకుందని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. బాలరాజు పాత్రలో తరుణ్ భాస్కర్ ఉత్సాహభరితమైన నటనతో మెప్పించారని ప్రశంసిస్తున్నారు. వీకే నరేశ్ నటన కూడా బాగుందని పేర్కొంటున్నారు. అయితే అనుపమ పరమేశ్వరన్ నటనా ప్రతిభను పూర్తిస్థాయిలో చూపించే సన్నివేశాలు సినిమాలో తక్కువగా ఉన్నాయని ఓ ప్రేక్షకుడు అభిప్రాయపడ్డాడు. మొత్తంగా ప్రథమార్ధం బాగుందని, ద్వితీయార్ధంపై ఆసక్తి నెలకొందని తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు. మరోవైపు, అనుపమ పరమేశ్వరన్ నటనను ప్రశంసిస్తూ కొందరు ప్రేక్షకులు సానుకూల స్పందన వ్యక్తం చేస్తున్నారు. కథతో పాటు వినోదం కూడా బాగా కుదిరాయని, దసరా సందర్భంగా కుటుంబంతో కలిసి చూడదగ్గ చిత్రంగా ఉందని అభిప్రాయపడుతున్నారు. ఈ సినిమా అనుపమకు మంచి పునరాగమనంగా నిలుస్తుందని ఓ నెటిజన్ పేర్కొన్నాడు. ప్రీమియర్ ప్రదర్శనల అనంతరం వెలువడుతున్న అభిప్రాయాల్లో సినిమాకు సానుకూల స్పందన కనిపిస్తోంది. ముఖ్యంగా తరుణ్ భాస్కర్ నటన, వినోదాత్మక అంశాల గురించి ప్రేక్షకులు ప్రస్తావిస్తున్నారు. అయితే ఇవి కొందరు ప్రేక్షకులు సామాజిక మాధ్యమాల్లో వెల్లడించిన వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే. పూర్తి స్థాయి ప్రేక్షకుల స్పందన, వసూళ్లు వెలువడిన తర్వాతే సినిమా విజయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# వివాదాలకు మౌనమే సమాధానం..

## మీరా జాస్మిన్ రీఎంట్రీ!



**హైదరాబాద్, అక్టోబరు 16 :** దక్షిణాది చిత్రసీమలో సహజసిద్ధమైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక మీరా జాస్మిన్. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి, మలయాళం, తెలుగు, తమిళ భాషల్లో ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో నటించి ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నారు. తన నటనకు జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పొందిన ఆమె కెరీర్‌లో విజయాలతో పాటు వివాదాలూ చోటుచేసుకున్నాయి. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న మీరా జాస్మిన్.. ఇప్పుడు మళ్లీ వరుస చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కెరీర్‌లో మంచి అవకాశాలు అందుకుంటున్న సమయంలో మీరా జాస్మిన్ చుట్టూ పలు వివాదాలు నెలకొన్నాయి. షూటింగ్ సమయంలో ఆమె ప్రవర్తన, పారితోషికం విషయంలో డిమాండ్లు వంటి అంశాలపై అప్పట్లో అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ ప్రచారాల్లో కొన్నింటిపై ఆమె స్పందించగా, మరికొన్నింటిని పట్టించుకోలేదు. అయితే, ఆ వివాదాలు ఆమె సినీ ప్రయాణంపై ప్రభావం చూపించాయనే చర్చ అప్పట్లో సాగింది. వ్యక్తిగత జీవితంలో కీలక నిర్ణయాలు తీసుకున్న మీరా జాస్మిన్ కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నారు. దాదాపు పదేళ్లకు పైగా వెండితెరకు దూరమైన ఆమె.. మలయాళ దర్శకుడు సత్యన్ అంతిక్కాడ్ చిత్రంతో తిరిగి నటనను ప్రారంభించారు. పునరాగమనం తర్వాత కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తూ, తన పాత్రకు ప్రాధాన్యం ఉన్న సినిమాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో తన చుట్టూ నెలకొన్న వివాదాలపై ఇప్పుడు పెద్దగా స్పందించకుండా, సినిమాలపైనే దృష్టి సారిస్తున్నారని కథనాలు పేర్కొంటున్నాయి. మోహన్‌లాల్‌తో కలిసి నటిస్తున్న 'అతి మనోహరం' చిత్రంపై కూడా ఆసక్తి నెలకొంది. గత అనుభవాలను పక్కనపెట్టి, పాత్రల ఎంపికతోనూ నటనతోనూ ప్రేక్షకులను ఆకట్టుకోవాలనే ప్రయత్నంలో మీరా జాస్మిన్ ముందుకు సాగుతున్నారు.



# నిత్య మీనన్ కోసం మూడు గంటలు..

## 'జమ్ము గరివిడి లక్ష్మి' వెనుక ఆసక్తికర విశేషాలు!

**హైదరాబాద్, అక్టోబర్ 16 :** వర్సటైల్ నటి నిత్య మీనన్‌ను తన సినిమాలో నటింపజేయడానికి దర్శకుడు గౌరి నాయుడు తీవ్రంగా ప్రయత్నించిన ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'జమ్ము గరివిడి లక్ష్మి' చిత్రంలోని సవాలుతో కూడిన ప్రధాన పాత్రకు నిత్య మీనన్ మాత్రమే న్యాయం చేయగలరని భావించిన గౌరి నాయుడు.. తొలుత కథ వినడానికి నిరాకరించిన ఆమెను ఒప్పించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. అయితే, జూమ్ కాల్‌లో సుదీర్ఘంగా కథ విని ఆమోదం తెలిపినప్పటికీ, కొన్ని అనూహ్య పరిణామాల వల్ల ఈ ప్రాజెక్టులో నిత్య మీనన్ భాగం కాలేకపోయారని దర్శకుడు ఇటీవల వెల్లడించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాత విశ్వప్రసాద్ సహకారంతో నిత్య మీనన్‌కు జూమ్ కాల్ ద్వారా కథ చెప్పే అవకాశం దక్కింది. కేవలం అరగంట మాత్రమే సమయం కేటాయిస్తానని నిత్య మీనన్ ముందే స్పష్టం చేయడంతో దర్శకుడిలో తీవ్ర ఆందోళన నెలకొంది. అయితే కథ ప్రారంభమైన అరగంటకే ముగిసినా, ఆసక్తికరంగా ఉండటంతో నిత్య మీనన్ మళ్లీ కాల్ చేసి కొనసాగించమని కోరారు. దాంతో దాదాపు మూడు గంటల పాటు సాగిన ఈ కథనం విన్న నిత్య మీనన్ తీవ్ర భావోద్వేగానికి గురై, సినిమా చేయడానికి అంగీకరించారు. అయితే, ఆ తర్వాత పారితోషికం, ఇతర ఒప్పంద నిబంధనల విషయంలో నిత్య మీనన్ బృందం, నిర్మాణ సంస్థ మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఆమె ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఈ చిత్రం సాధారణ కథ కాదని, 40 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న ఒక వ్యక్తి జీవితంలోని వివిధ దశలను, మూడు భాషల యాసలను ప్రతిబింబించే నటన ప్రాధాన్యమున్న పాత్ర అని గౌరి నాయుడు వివరించారు. నిత్య మీనన్ తప్పుకోవడంతో ఆ పాత్రకు సరిపోయే నటి కోసం ఆరు నెలల పాటు అన్వేషణ సాగించామని, ఐశ్వర్య రాజేష్, అంజలి, ఆనంది వంటి నటీమణుల పేర్లను పరిశీలించినా సరైన ఎంపికను నిర్ణయించడం సవాలుగా మారిందని పేర్కొన్నారు.



# 'రామాయణం' నుంచి మరో ట్రైలర్ విడుదల!

**హైదరాబాద్, అక్టోబరు 16 :** భారతీయ సినీ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పిన పౌరాణిక చిత్రం 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' నుంచి మరో ట్రైలర్ విడుదలైనట్లు సమాచారం. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ ప్రచార చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. 'దంగల్'తో గుర్తింపు తెచ్చుకున్న నితేష్ తివారీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో కనిపించనుండగా, సాయి పల్లవి సీతాదేవిగా నటిస్తున్నారు. వీరిద్దరి పాత్రలపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు, కన్నడ స్టార్ యశ్ రావణుడి పాత్రలో కనిపించనుండటంతో ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. భారీ నిర్మాణ విలువలు, పౌరాణిక నేపథ్యం, ప్రముఖ నటీనటుల కలయిక ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. తాజా ప్రచారం ప్రకారం, 'రామాయణం' తొలి భాగాన్ని 2026 నవంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్రణాళికలు ఉన్నట్లు సమాచారం. అయితే విడుదల తేదీ, భాషలవారీగా ప్రదర్శన, ఇతర వివరాలపై అధికారిక ప్రకటనలను నిర్ధారించుకోవాల్సి ఉంది. భారతీయ ఇతిహాసమైన రామాయణం ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకట్టుకునేలా సాంకేతిక ప్రమాణాలు, దృశ్య ప్రభావాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ వంటి ప్రముఖ నటులు భాగం కావడంతో ఈ ప్రాజెక్టుపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. తాజా ట్రైలర్‌పై ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందో చూడాలి. ట్రైలర్ విడుదల, సినిమా పేరు, నవంబరు 5 విడుదల తేదీ వంటి వివరాలను ప్రచురించే ముందు చిత్ర నిర్మాణ సంస్థ అధికారిక ప్రకటనతో సరిపోల్చండి.

# అది లేకపోతే అస్సలు కుదరదు

**హైదరాబాద్, అక్టోబరు 16 :** టాలీవుడ్ నటి శ్రీలీల తన నటనతోనే కాకుండా, వ్యక్తిగత అభిరుచులతోనూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తనకు వంట చేయడమంటే ఇష్టమని వెల్లడించారు. సాంబారు, కొబ్బరన్నం, కుర్మా కూర వంటి పలు రకాల వంటకాలను సులభంగా తయారు చేయగలనని చెప్పారు. అయితే ఎన్ని రకాల వంటలు చేసినా తన భోజనంలో పెరుగన్నం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. వంటల గురించి మాట్లాడుతూ శ్రీలీల తనకు ఇష్టమైన ఆహారపు అలవాట్లను పంచుకున్నారు. సాంబారు, కొబ్బరన్నం, కుర్మా కూరతో పాటు ఎన్నో వంటకాలు చేయగలనని తెలిపారు. అయితే చిన్నప్పటి నుంచే పెరుగన్నం అంటే తనకు ఎంతో ఇష్టమని, ఎలాంటి ప్రత్యేక వంటకాలు ఉన్నా చివర్లో పెరుగన్నం ఉండాల్సిందేనని సరదాగా చెప్పారు. దీంతో శ్రీలీల ఆహారపు అభిరుచులపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇటీవల సినిమాల్లో ఎక్కువగా కనిపించడం లేదనే ప్రశ్నకు కూడా శ్రీలీల స్పందించారు. గత కొన్ని రోజులుగా వరుస చిత్రాల షూటింగులతో బిజీగా ఉన్నానని వెల్లడించారు. తాను నటిస్తున్న సినిమాలకు సంబంధించిన వివరాలను చిత్రబృందాలు ఇంకా అధికారికంగా ప్రకటించలేదని, అందువల్ల ప్రస్తుతానికి వాటి గురించి మాట్లాడలేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం రెండు రోజుల విరామం లభించిందని శ్రీలీల తెలిపారు. షూటింగుల హడావుడి నుంచి కాస్త విరామం తీసుకుని ఈ సమయాన్ని కుటుంబ సభ్యులతో గడుపుతున్నానని చెప్పారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా కుటుంబంతో గడిపే సమయం తనకు ఎంతో విలువైనదని ఆమె మాటలను బట్టి తెలుస్తోంది. మరోవైపు, శ్రీలీల తదుపరి చిత్రాల వివరాల కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.



Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com